44వ జాతీయ రహదారిపై ఆందోళన చేపడుతున్న టిడిపి నాయకులు

టిడిపి బంద్ పాక్షికం... ప్రశాంతం...

- టిడిపి నేతల ముందస్తు గృహ నిర్బంధం
- బంద్ చేయడానికి వెళ్లిన నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- 44వ జాతీయ రహదారిపై టిడిపి నాయకుల రాస్తారోకో

ప్రజాశక్తి - కర్నూలు విలేకరులు

టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు రిమాండుకు నిరసనగా టిడిపి చేపట్టిన రాష్ట్ర బంద్ నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ప్రశాంతంగా కొనసాగింది. టిడిపి నాయకులను ఎక్కడికక్కడ అదుపులోనికి తీసుకున్నారు. కర్నూలులో టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బంద్ చేపట్టేందుకు బయటకు వచ్చిన టిడిపి కర్నూలు జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆదోనిలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఆర్‌టిసి డిపో ముందు బైటాయించారు. టిడిపి కార్యకర్తలపై పోలీసులు లాఠీఛార్జి చేశారు. నాయకులను బలవంతంగా పోలీస్ స్టేషన్‌కు తరలించారు. టిడిపి ఇంఛార్జి మీనాక్షి నాయుడును హౌస్ అరెస్టు చేశారు. టిడిపి మాజీ ఇన్‌ఛార్జి గుడిసె కృష్ణమ్మను అరెస్టు చేశారు. ఎమ్మిగనూరులో మంత్రాలయం ఇంఛార్జి తిక్కారెడ్డిని హౌస్ అరెస్టు చేశారు. బనగానపల్లెలో టిడిపి ఇంఛార్జి బిసి జనార్ధన్‌రెడ్డి సతీమణి బిసి ఇందిరను హౌస్ అరెస్టు చేశారు. ఎమ్మిగనూరులో మాజీ ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వర్‌రెడ్డిని అరెస్టు చేశారు. జిల్లా వ్యాప్తంగా పలు పాఠశాలలకు సెలవు ప్రకటించారు. దుకాణదారులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. కొన్ని ప్రాంతాల్లో తెరచి ఉంచిన దుకాణాలను టిడిపి నాయకులు మూసి వేయించారు. ఆర్‌టిసి బస్సులు యథావిధిగా తిరిగాయి. జిల్లా వ్యాప్తంగా పోలీసులు 144సెక్షన్ అమలు చేశారు. బంద్ ప్రభావం పెద్దగా కనిపించలేదు.

కర్నూలు హాస్పిటల్ : కర్నూలు, కల్లూరు ప్రాంతాల్లో బంద్ పాక్షికంగానూ ప్రశాంతంగా జరిగింది. పాణ్యం మాజీ ఎమ్మెల్యే టిడిపి ఇన్చార్జ్ గౌరు చరిత ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ మాధవి నగర్ గౌరు దంపతుల స్వగృహం వద్ద బందు నిర్వహించడానికి వెళుతున్న గౌరు చరిత రెడ్డిని, టిడిపి నందికొట్కూరు ఇన్చార్జి గౌరు వెంకటరెడ్డిని టిడిపి ముఖ్య నాయకులను, కార్యకర్తలను పోలీసులు బలగాలు చుట్టుముట్టి అడ్డుకున్నారు. నాయకులందరినీ హౌస్ అరెస్ట్ చేశారు. సమాచారం తెలుసుకున్న ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి సంఘాల నాయకులు పాముల కుమార్, పరమేష్ మాదిగ సూరి మాదిగ తదితరులు దంపతుల స్వగృహానికి వచ్చి సంఘీభావం తెలిపారు. టిడిపి , ఐటిడిపి, బీసీ సెల్ ఆధ్వర్యంలో 44వ జాతీయ రహదారిని ఇంటర్నేషనల్ ఫంక్షన్ హాల్ వద్ద దిగ్బంధం చేశారు. వెంటనే స్థానిక 4పట్టణ పోలిస్ అధికారులు నిలువరించి స్టేషన్‌కు తరలించారు. కల్లూరు మండలం 44వ నంబరు జాతీయ రహదారి తడకనపల్లి క్రాస్ రోడ్డుపై బైఠాయించి తెలుగు తమ్ముళ్లు నిరసన తెలిపారు. **వెల్దుర్తి :** బందులో పాల్గొన్న టిడిపి నాయకులు బలరాం గౌడ్, సుబ్బరాయుడు, సూదే పల్లి జయరాముడు, సుధాకర్ గౌడ్, లక్ష్మిరెడ్డి, టిడిపి కార్యకర్తలను, సిసిఐ నాయకులు కృష్ణను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. **గూడూరులో** పలు షాపుల యజమానులను బందుకు స్వచ్ఛంగా సహకరించాలని కోరారు.. రాష్ట్ర బంద్ ను విఫలం చేయడానికి పోలీసులు వేకువజాము నుండే టిడిపి నేతల ఇళ్లను ముట్టడించి కట్టడి చేశారు. టిడిపి జాతీయ ఉపాధ్యక్షులు కోట్ల జయ సూర్య ప్రకాష్ రెడ్డి అనుచరులు, టిడిపి నేతలు కర్నూల్ పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి చరణ్ కుమార్ రైతు సంఘం కార్యదర్శి రేవుల గోవింద్ లను ముందస్తు అరెస్ట్ చేశారు. **కోడుమూరులో** టిడిపి, సిపిఐ, ఎమ్మార్పీఎస్ నాయకులను బందుకు వెళ్లకుండా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. కోడుమూరు టిడిపి నియోజకవర్గ ఇంచార్జి అకేపోగు ప్రభాకర్ ను, టిడిపి మండల కన్వీనర్ కోట్ల కవితమ్మను, అధికారప్రతినిధి సిబి లత ను, పోలీస్ లు బయటకు రాకుండా ఇంటిదగ్గరనేనిర్భందించారు. సీబీ లత ఇంటి దగ్గరనే కార్యకర్తలతో కలిసి నిరసన చేపట్టారు. **కర్నూలు (క్రైమ్)** రూరల్ మండలంలో టిడిపి సీనియర్ జిల్లా నాయకులు నేత విష్ణువర్ధన్ రెడ్డి నాయకత్వంలో చేపట్టిన బంద్‌లో భాగంగా ఆయనతో పాటు పలువురుని గృహ నిర్బంధం చేశారు. అనంతరం టిడిపి యువ నాయకులు బొగ్గుల దస్తగిరి, సర్పంచి ఎ.జయన్న, మాధవ స్వామి, ఎంపిటిసి కురువ నాగరాజు, టిడిపి మండల అధ్యక్షులు వెంకటేష్‌ను కర్నూలు తాలూకా పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. **తుగ్గలి:** పత్తికొండ రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో తుగ్గలి, జొన్నగిరి ఎస్ఐ మల్లికార్జున, రామాంజనేయులు సోమవారం ముందస్తు జాగ్రత్తగా టిడిపి నాయకులు మనోహర్ చౌదరి, తిరుపాల్ నాయుడు, బర్మా వీరేష్ తోపాటు వివిధ గ్రామాలకు చెందిన టిడిపి నాయకులను, కార్యకర్తలను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు.

బంద్‌కు సహకరించిన జనసేన

కర్నూలు అగ్రికల్చర్ : తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్ట్‌ను ఖండిస్తూ తెలుగుదేశం పార్టీ చేపట్టిన రాష్ట్ర బంద్‌కు జనసేన నాయకులు సుధాకర్,మంజునాథ్,కొండల్, సతీష్, షబ్బీర్ బంద్‌కు సంఘీభావం తెలిపారు. జిల్లా నాయకులు చింత సురేష్ బాబును హౌస్ అరెస్టు చేశారు.

ఇంటి వద్దనే ఆందోళన చేపడుతున్న గౌరు చరితారెడ్డి, నాయకులు

టిడిపి జిల్లా అధ్యక్షులు బిటి.నాయుడును అరెస్టు చేస్తున్న పోలీసులు

వర్షాభావమే..!

- జిల్లా వ్యాప్తంగా అదే పరిస్థితి
- 24 మండలాల్లో 50 శాతం కన్నా లోటు వర్షపాతం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లా వ్యాప్తంగా వర్షాభావం నెలకొంది. జిల్లాలోని 26 మండలాల్లోనూ అదే పరిస్థితి ఏర్పడింది. ఆగస్టు నెలలో 24 మండలాల్లో 50 శాతం కన్నా లోటు వర్షపాతం నమోదైంది. దీంతో పంటలన్నీ ఎండుముఖం పట్టాయి...

జిల్లాలో ఖరీఫ్ ప్రారంభంలో తొలకరి చినుకులు పడటంతో రైతులు ఆశతో పలు పంటలను సాగు చేశారు. తీరా వర్షం పడకుండా వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆగస్టు నెలలో జిల్లా వ్యాప్తంగా అదే పరిస్థితి నెలకొంది. జిల్లా వ్యాప్తంగా సాధారణ వర్షపాతం కన్నా 75 శాతం లోటు వర్షపాతం నమోదైంది. జిల్లా సగటున 116.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా కేవలం 29.3 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది. జిల్లాలోని 26 మండలాల్లో 24 మండలాల్లో 50 శాతం కన్నా లోటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చిప్పగిరి మండలంలో 99 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. 84.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా కేవలం 1.2 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది. నందవరం మండలంలో 51 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. మంత్రాలయం మండలంలో 68 శాతం, ఎమ్మిగనూరులో 75 శాతం, కౌతాళంలో 46 శాతం, హోళగుందలో 70, పత్తికొండలో 71 శాతం, ఆదోనిలో 58 శాతం, ఆస్పరిలో 93 శాతం, హాలహర్విలో 96 శాతం లోటు వర్షం కురిసింది. ఓర్వకల్లు మండలంలో 77 శాతం, పెద్దకడబూరులో 86 శాతం, కర్నూలు అర్బన్ 58 శాతం, కల్లూరులో 38 శాతం, కోసిగిలో 81 శాతం, సి.బెళగల్‌లో 92 శాతం, గూడూరులో 87 శాతం, కర్నూలు రూరల్‌లో 75 శాతం లోటు వర్షపాతం ఏర్పడింది. కోడుమూరు మండలంలో 51 శాతం, గోనేగండ్లలో 89 శాతం, ఆలూరులో 89 శాతం, దేవనకొండలో 71 శాతం, కృష్ణగిరిలో 78 శాతం, వెల్దుర్తిలో 86 శాతం, మద్దికెరలో 96 శాతం, తుగ్గలి మండలంలో 73 శాతం లోటు వర్షం కురిసింది. వర్షాభావం ప్రభావం సాగుపై పడింది. కర్నూలు జిల్లాలో మొత్తం సాధారణ సాగు 10,53,900 ఎకరాలు కాగా 7,56,662.5 ఎకరాల్లో రైతులు విత్తనాలు వేశారు. నంద్యాల జిల్లాలో మొత్తం సాధారణ సాగు 5,93,482.5 ఎకరాలు కాగా 3,36,165 ఎకరాల్లో మాత్రమే రైతులు విత్తనాలు వేశారు. విత్తనాలు విత్తే సమయంలో వర్షాలు పడకపోవడంతో సాగుకు రైతులు అసక్తి చూపలేదు. దీంతో కర్నూలు జిల్లాలో 71.80 శాతం పంటలను సాగు చేశారు. కర్నూలు జిల్లాలో ప్రధాన పంటగా ఉండే పత్తి సాధారణ సాగు 6,25,067.5 ఎకరాలు కాగా 4,55,577.5 ఎకరాల్లో సాగు చేశారు. వర్షం లేకపోవడం వల్ల ఇప్పటికే పలు ప్రాంతాల్లో పత్తి చెట్లు ఎండిపోతున్నాయి. వేరుశనగ సాధారణ సాగు 1,66,407.5 ఎకరాలు కాగా 97,447.5 ఎకరాల్లో విత్తనాలు వేశారు. వరి సాధారణ సాగు 32,272.5 ఎకరాలు కాగా 16,510 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. కంది సాధారణ సాగు 59,822.5 ఎకరాలు కాగా 47925 ఎకరాల్లో విత్తనాలు విత్తారు. ఉల్లి సాధారణ సాగు 38,582.5 ఎకరాలు కాగా 25,095 ఎకరాలు మాత్రమే సాగు చేశారు. కర్నూలు జిల్లాలో వర్షాభావం ఏర్పడటంతో సాగు చేసిన పంటలు కూడా ఎండిపోతున్నాయి.

ప్రతి ఎకరాకు సాగునీరందే వరకు పోరాటం

- రైతులందరూ ఐకమత్యంతో ఉద్యమించాలి - కరువు సహాయక చర్యలు చేపట్టాలి
- ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారమివ్వాలి - గుండ్లకొండ ప్రధాన కాలువకు స్లూయిజ్ ఏర్పాటు చేయాలి
- రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని అన్ని గ్రామాల్లోనూ ప్రతి ఎకరాకూ హంద్రీనీవా కాలువ ద్వారా సాగునీరందే వరకు పోరాడతామని రైతుసంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్ రెడ్డి తెలిపారు. అందుకు రైతులందరూ ఐక్యంగా సంఘటితమై ఉద్యమించాలని కోరారు. గుండ్లకొండ హంద్రీనీవా కాలువ దగ్గర స్లూయిజ్ ఏర్పాటు చేసి పి.కోటకొండ, మాచాపురం గ్రామాల వరకు సాగునీరు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర సోమవారం గుండ్లకొండ నుంచి నేలతలమర్రి మీదుగా దేవనకొండకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఆందోళన చేపట్టారు. రైతుసంఘం మండల కార్యదర్శి సూరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడారు. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో జూన్ నెల ప్రారంభంలో కురిసిన అరకొర వర్షాలకు రైతులు పంటలు సాగు చేశారని తెలిపారు. తర్వాత వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో మొక్కలు గిడుసబారి ఎదుగుదల లేక తీవ్రంగా దెబ్బతినడంతో రైతులు నష్టపోయారని చెప్పారు. ఖరీఫ్ సీజన్‌లో నష్టపోయిన రైతులందరికీ ఎకరాకు రూ.40 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కూలీలు వలసలు వెళ్లకుండా ఉపాధి హామీ చట్టం కింద అదనంగా వందరోజుల పని కల్పించాలని డిమాండ్ చేశారు. రైతు ప్రభుత్వమని గొప్పలు చెప్పుకుంటున్న వైసిపి రైతుల గోడును పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల అభివృద్ధికి ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని తెలిపారు. గత నాలుగేళ్ల పాలనలో ప్రభుత్వం హంద్రీనీవా కాలువ మరమ్మతులకు నిధులు కేటాయించకపోవడం దారుణమన్నారు. పంట కాలువల నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో మండలంలో 46 వేల ఎకరాలకు సాగునీరు అందడం లేదని తెలిపారు. రాజస్థాన్ తార్ ఎడారి ప్రాంతంలో ఏ విధంగా వర్షాభావ పరిస్థితుల ఉంటాయో, అనంతపురం, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతంలో అలాంటి కరువు పరిస్థితులు ఉంటున్నాయని తెలిపారు. ముఖ్య అతిథులుగా రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.రామకృష్ణ, వెంకటేశులు, వ్యకాస జిల్లా అధ్యక్షులు వీర శేఖర్ మాట్లాడుతూ... పాలక ప్రభుత్వాలు రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తున్నాయని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతుల అభివృద్ధికి ఎంతో చేస్తామని హామీలు ఇచ్చిన నియోజవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి గుమ్మనూరు జయరామ్ ఎలాంటి అభివృద్ధి చేయలేదన్నారు. పి.కోటకొండ గ్రామ బస్ స్టేషన్ నుంచి బేతపల్లి గ్రామం వరకు రహదారి కంకర రాళ్లు తేలి అధ్వాన స్థితికి చేరుకుందన్నారు. ఆ రోడ్డు నిర్మాణం చేపట్టాల్సిన ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. ఆ గ్రామానికి వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అనంతరం తహశీల్దార్ వెంకటేష్ నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. చెల్లెల చెలిమల, గుడిమిరాళ్ల సర్పంచులు చిన్న రామప్ప, శేషి రెడ్డి, ఉప సర్పంచి కౌలుట్ల, రైతు సంఘం, ప్రజాసంఘాల నాయకులు అశోక్, యూసుఫ్ బాష, ఓంకార్, శ్రీనివాసులు, బజారి, మహబూబ్ బాషా, శ్రీరాములు, నాగేష్, నాగేంద్ర, నాగరాజు, రాయుడు, రంగన్న, సుంకన్న, వీరేంద్ర, కౌలుట్లయ్య స్వామి, రైతులు కృష్ణ, వెంకట రాముడు, హనుమన్న, కౌలుట్ల, ప్రహ్లాద, శీను, జయ చంద్ర పాల్గొన్నారు.

పోలీసుల ఆంక్షలతో సాగిన పాదయాత్ర

రాష్ట్రంలో 144 సెక్షన్ అమలులో ఉండడంతో మండలంలో రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర పోలీసుల ఆంక్షలతో ముందుకు సాగింది. గుండ్లకొండ నుంచి నేలతలమర్రి మధ్యలో పాదయాత్రను ఆపాలని ఎస్ఐ భూపాలుడు ప్రయత్నించారు. రైతుల కోసం, ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్నామని, రాజకీయ పార్టీల కోసం తాము పోరాడడం లేదని రైతు సంఘం నాయకులు తేల్చి చెప్పారు. పాదయాత్ర యథావిధిగా సాగుతూ విజయవంతంగా ముగిసింది.

ఆందోళనలో మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

పెండింగ్ వేతనాలివ్వాలని ఎంపిడిఒకు వినతి ఇస్తున్న అంజిబాబు, వెంకట్రాముడు

పెండింగ్ వేతనాలివ్వాలి

సిఐటియు ఆధ్వర్యంలో ఎంపిడిఒకు స్వచ్ఛభారత్ కార్మికుల వినతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. అంజి బాబు డిమాండ్ చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు హుస్సేనయ్య, మండల నాయకులు రాఘవేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వెంకట్రాముడు స్వచ్ఛభారత్ కార్మికులతో కలిసి కర్నూలు మండలం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చిన తర్వాత ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్వచ్ఛభారత్ పథకం ద్వారా గ్రామాల్లో కొంతమేర పరిశుభ్రతజరిగేదన్నారు. ఆ పథకం ద్వారా దేశంలో ఎంతోమందికి ఉపాధి కూడా లభించిందని, అలాంటి పథకం సరిగ్గా నిర్వహించలేక చేతకానితనంతో ఎత్తివేసారని అన్నారు. దానితో లక్షలాది మంది ఉపాధి కోల్పోయారని, 20 నెలలు, 15 నెలలు, 10 నెలల పాటు జీతాలు పెండింగులో ఉన్నాయని అన్నారు. ప్రాణాలను ఫణంగా పెట్టి చేసిన పనికి వేతనం ఇవ్వకపోవడం చాలా దుర్మార్గమని వెంటనే పెండింగులో ఉన్న వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తొలగించిన స్వచ్ఛభారత్ కార్మికులందరినీ పంచాయతీ కార్మికులు గా పని చేయించుకుంటామని, పంచాయతీ పరిధిలో ఉన్న నిధులకు అనుగుణంగా వేతనాలు ఇస్తామని తెలిపారని అన్నారు. ప్రభుత్వంగా సర్పంచులు ప్రత్యేకంగా పని చేయించుకుంటున్న గ్రామాల్లో కూడా నెలల తరబడి వేతనాలు పెండింగులో పెట్టడం సరైన పద్ధతి కాదని, వెంటనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసి వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. 15, 14వ ఆర్థిక సంఘం నిధుల ద్వారా పంచాయతీలకు ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. వినతి పత్రం అందించిన వారిలో రంగన్న, నాగన్న, చిన్న, జీవన, పెద్ద దీవెన, తప్పేట మద్దిలేటి, తిమ్మప్ప, టి.మద్దిలేటి పాల్గొన్నారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్యసమావేశం

ప్రజాశక్తి-సి బెళగల్

ఈనెల 12న మండల పరిషత్ కార్యాలయంలో సర్వసభ్యసమావేశం నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి ఎంపిడిఒ శ్రీనివాసులు సోమవారం తెలిపారు. అధికారులు, ప్రతినిధులు తప్పక నివేదికలతో హాజరు కావాల్సి ఉంటుందని అన్నారు. జరిగిన అభివృద్ధి, జరగాల్సిన అభివద్ధి, వాటి నిధుల ఖర్చులు , ప్రతిపాదన తయారు వంటివి చర్చించుకోవాల్సిన అవసరం మనకంతా ఉందని పేర్కొన్నారు.

13న పత్తికొండలో స్పందన

జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

ప్రతి బుధ, శుక్ర వారాల్లో మండలాల్లో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. ఈనెల 13న పత్తికొండలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం కలెక్టరేట్లో నీ సమావేశ భవనంలో స్పందన కార్యక్రమం నిర్వహించారు.కలెక్టర్, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్యతో కలిసి అర్జీలను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వారానికి రెండు సార్లు మండల స్థాయిలో స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరిస్తామని అన్నారు. ఈనెల 13న బుధవారం పత్తికొండలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. జిల్లా అధికారులు అందరూ ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్నకు చెబుదాం, స్పందన సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలని, వీటిని గడువులోపు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్జీదారులతో మాట్లాడి సంతప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం చూపించాలని కలెక్టర్ ఆదేశించారు. పత్రికలలో వచ్చే ప్రతికూల అంశాలతో పాటు ప్రజా ప్రతినిధులు ఇచ్చే అర్జీలను పరిశీలించి, చేయగలిగిన సమస్యలయితే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. రెండు రోజుల్లోపు నివేదికను అందచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. తహశీల్దార్లు, ఎంపిడిఒ, పోలీసు సబ్ ఇన్‌స్పెక్టర్ సభ్యులుగా ఉండి నిర్వహిస్తున్న మండల స్థాయి కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించాలని ఆదేశించామన్నారు. ఆ మేరకు సమావేశాలను నిర్వహించి, సమావేశపు మినిట్స్‌ను వెంటనే తెప్పించుకోవాలని డిఆర్ఒ, సిపిఒను కలెక్టర్ ఆదేశించారు. జగనన్న ఆరోగ్య సురక్ష పథకం నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు వారి పరిధిలోని అన్ని కుటుంబాలను సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో డిఆర్ఒ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

స్పందనలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ డాక్టర్ సృజన, జెసి

అదనపు ఆదాయంతో మరింత అభివృద్ధి

నగర పాలక సంస్థ తొలి పెట్రోల్ పంపు ప్రారంభం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగర పాలక సంస్థ వివిధ రకాల ఆదాయ మార్గాలతో నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు దోహదపడతాయని నగర మేయర్ బివై. రామయ్య అన్నారు. కొండారెడ్డి బురుజు సమీపంలో ఇండియన్ ఆయిల్ సంస్థతో కలిసి కర్నూలు నగర పాలక సంస్థ ఏర్పాటు చేసిన నూతన పెట్రోల్ పంపును సోమవారం మేయర్‌బివై.రామయ్య, ఎమ్మెల్యేలు హాఫీజ్ ఖాన్, కాటసాని రాంభూపాల్ రెడ్డి, కమిషనర్ ఎ.భార్గవ్ తేజ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం శిలాఫలకం ఆవిష్కరించారు. మేయర్ మాట్లాడుతూ ప్రజాధనాన్ని వృథా చేయకుండా వాటినే పెట్టుబడిగా పెట్టి సంస్థకు మరింత ఆదాయం సమకూర్చే విధంగా అడుగులు వేస్తున్నామని పేర్కొన్నారు. ఇలాంటి వినూత్న ఆలోచన రాష్ట్రంలోనే ఏ కార్పొరేషన్ చేయలేదన్నారు. దీనినే స్ఫూర్తిగా తీసుకొని మరో పెట్రోల్ పంపు ప్రారంభిస్తామని వెల్లడించారు. ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్ రెడ్డి, ఎంఎ. హాఫీజ్‌ఖాన్ మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో మున్సిపాలిటీలను తమ పార్టీ స్థానిక నాయకులకు ఆదాయ మార్గంగా చూసేవారని, తద్వారా నగరాలు, పట్టణాలు అధ్వాన్నంగా ఉండేవని అన్నారు. వాటికి భిన్నంగా వైఎస్. జగన్ ప్రభుత్వం అనేక ప్రత్యేక కార్యక్రమాలకు నాంది పలికారన్నారు. అందుకే జాతీయ స్థాయిలో అవార్డులు, రాష్ట్రంలో కార్పొరేషన్ల మధ్య పోటాపోటీ నెలకొందన్నారు. కమిషనర్ భార్గవ్ తేజ మాట్లాడుతూ రానున్న రోజుల్లో సంస్థకు అదనపు ఆదాయం సమకూర్చేకునేందుకు మరిన్ని మార్గాలను అన్వేషిస్తున్నట్లు తెలిపారు. పెట్రోల్ పంపు ఏర్పాటు ద్వారా ఆదాయంతో పాటు సంస్థకు చెందిన వాహనాలకు కమిషన్ లేకుండానే పెట్రోల్, డీజిల్ లభిస్తుందన్నారు. పెట్రోల్ పంపు నందు 14 మంది సిబ్బందిని ఉంచామని, నగదు రహిత లావాదేవీల ఏర్పాటు చేశామన్నారు. 20,000 వేల లీటర్ల సామర్థ్యంతో నిరంతరాయంగా పంపు కొనసాగుతోందని తెలిపారు. పెట్రోల్ పంపు ఏర్పాటు చేసిన తొలి కార్పొరేషన్ కర్నూలే అన్నారు. కార్యక్రమంలో నగర అధ్యక్షురాలు సిగ్రు. సత్యనారాయణమ్మ, మహిళా విభాగం జోనల్ ఇంచార్జ్ గాజుల. శ్వేతరెడ్డి, కార్పొరేటర్లు షాషావలి, అర్షియా ఫర్హీన్, జుబేర్, క్రైప. పద్మలత, నారయణ రెడ్డి, శ్రీనివాసరావు, కో అప్షన్ మెంబర్ కృష్ణమూర్తి, అదనపు కమిషనర్ రామలింగేశ్వర్, మేనేజర్ చిన్నరాముడు, రెవెన్యూ ఆఫీసర్ జునైద్ తదితరులు పాల్గొన్నారు.

నగర పాలక సంస్థ తొలి పెట్రోల్ పంపు ప్రారంభిస్తున్న అతిథులు

జిల్లా బంద్ విజయవంతం

టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు బి టి నాయుడు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ చేపట్టిన టిడిపి బంద్ జిల్లాలో విజయవంతమైంది. ప్రజలు గెలిచారు. సైకో సీఎం జగన్ ఓడారు అని టిడిపి జిల్లా అధ్యక్షులు ఎమ్మెల్సీ బిటి.నాయుడుఅన్నారు. సోమవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బందును అడ్డుకునేందుకు ఎన్నో ఇబ్బందులను పోలీసులు సృష్టించినా బెదరకుండా జిల్లా బందును విజయవంతం చేసిన పార్టీ ఇన్చార్జీలు కోట్ల జయసూర్యప్రకాష్ రెడ్డికి, కెయి. ప్రభాకర్‌కు, కోట్ల సుజాతమ్మ, కె. మీనాక్షినాయుడు పి.తిక్కారెడ్డి, బివి. జయనాగేశ్వర రెడ్డి , కెయి. శ్యామ్‌కుమార్ ,అకెపోగు ప్రభాకర్‌కు, స్థానికంగా లేకపోయినా టిజి.భరత్ తన క్యాడర్ మొత్తాన్ని ఈ కార్యక్రమాలలో పాలుపంచుకొనేలా ఆదేశించారన్నారు. వారందరికి, అలాగే పార్టీ, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్చార్జీలు, నియోజకవర్గం, మండలం, గ్రామ స్థాయి నాయకులకు కార్యకర్తలకు ప్రజానీకానికి పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. ఇదేంకర్మ మనరాష్ట్రానికి అని పోరాటానికి చంద్రబాబు పూనుకొని ప్రజల పక్షాన పోరాడారని అన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపి క్షణికానందం పొందుతున్న జగన్‌కు తగిన బుద్ధి చెప్పే సమయం అసన్నమైందన్నారు. అనంతరం చంద్రబాబు అరెస్టు కారణంగా డోన్ మండలం అమ్మిరెడ్డిపల్లెకు చెందిన గోవిందు నాయుడుకు గుండెపోటులో గౌరి గౌపాల్ హాస్పటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆయన ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసుకునేందుకు హాస్పటల్‌కు కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి, వై.నాగేశ్వరరావుయాదవ్, ఆకెపోగుప్రభాకర్‌తో పాటు వెళ్లి పరామర్శించారు.

బాధితుడిని పరామర్శిస్తున్న బిటినాయుడు

ఆర్‌యులో హరితహారం

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ విశ్వ విద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో హరితహారం కార్యక్రమం కింద మొక్కలను నాటారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ఆనందరావు పాల్గొని మొక్కలు నాటారు. హరితహారంలో బాగంగా దాదాపుగా 1500 వందల మొక్కలను ఏకదాటిగా నాటించటం విశేషం. ఇందులో పండ్ల మొక్కలు, ఆయుర్వేద మొక్కలు, అడవి జాతి మొక్కలను పెంచుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమ నిర్వహకులు డాక్టర్ గంధం అరుణ, డాక్టర్ వేంకటరత్నం, డాక్టర్ విజయుడు, డాక్టర్ నాగచంద్రుడు, శివప్రసాద్, రఘు పాల్గొన్నారు.

ఆర్‌యులో మొక్కలు నాటుతున్న విసి

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- బంద్‌లో టిడిపి నాయకులు - టిడిపి నాయకుల ముందుస్తు అరెస్టులు, గృహ

ఆదోని పోలీసు స్టేషన్‌లో ఉన్న ఉమాపతి నాయుడు

ఆదోనిలో రోడ్డుపై బైఠాయించిన గుడిసె కృష్ణమ్మ

నందవరం : బీవీని, గురురాజ్ దేశాయిని అరెస్టు చేస్తున్న పోలీసులు

గోనెగండ్లలో పోలీసుల అదుపులో ఉన్న టిడిపి నాయకులు

ఆస్పరిలో పోలీసుల అదుపులో ఉన్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి - ఆదోని

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని టిడిపి నాయకులు తెలిపారు. టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ ఆదోనిలో టిడిపి నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున ఆర్‌టిసి డిపో ముందు టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో నాయకులు బైఠాయించి నిరసన తెలపడంతో బస్సులు డిపోకే పరిమితమయ్యాయి. సుమారు 9 గంటల వరకు డిపో నుంచి బస్సులు బయటకు రాలేదు. రోడ్డుపై బైఠాయించడంతో వాహనాలు బారులు తీరాయి. వివిధ పనుల నిమిత్తం వచ్చిన వారు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆందోళనను విరమించాలని సిఐలు విక్రమ్ సింహ, శ్రీనివాస్ నాయక్ నాయకులకు నచ్చచెప్పారు. ఈ సందర్భంగా ఉమాపతి నాయుడు మాట్లాడారు. తమ అధినేత చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరసన చేస్తున్నామని తెలిపారు. ఇది స్థానిక సమస్య కాదని, పోలీసులు సహకరించాలని కోరారు. పోలీసులు ఒప్పుకోకపోవడంతో ఉమాపతి నాయుడు, బుద్ధారెడ్డి, మహబూబ్ బాషను పోలీసులు బలవంతంగా వాహనంలోకి ఎక్కించారు. టూ టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. టిడిపి నాయకులు జీపును అడ్డుకున్నారు.

లాఠీచార్జ్ చేసిన పోలీసులు

ఆర్‌టిసి డిపో ముందు పోలీసు వాహనానికి ముందు టిడిపి కార్యకర్తలు అడ్డుపడడంతో వారిని బలవంతంగా పక్కకు నెట్టేందుకు పోలీసులు శ్రమించాల్సి వచ్చింది. వన్ టౌన్ సిఐ విక్రమ్ సింహ కార్యకర్తలపై లాఠీచార్జ్ చేశారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు రామాంజనేయులు, టిడిపి నాయకులు సజ్జాత్, మల్లికార్జున, బసాపురం వెంకటేష్‌లు లాఠీ దెబ్బలను సైతం లెక్కచేయకుండా వాహనాన్ని ముందుకు పోకుండా అడ్డుకున్నారు. ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. టిడిపి నాయకులు రంగస్వామి నాయుడు కార్యకర్తలకు నచ్చజెప్పడంతో పరిస్థితి అదుపులోకి వచ్చింది. నాయకులు భూపాల్ చౌదరి, మారుతి నాయుడు, సిద్ధార్థ నాయుడు, లక్ష్మీనారాయణ, జయరామ్, తిమ్మప్ప, వెంకటేష్ ఉన్నారు.

గుడిసె కృష్ణమ్మను లాగేసిన పోలీసులు

చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసనగా టిడిపి నియోజకవర్గ మాజీ ఇన్‌ఛార్జ్ గుడిసె కృష్ణమ్మ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేపట్టారు. ఆర్‌టిసి డిపో ముందు ఆమె గంట పాటు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. త్రీ టౌన్ ఎస్ఐ విజయలక్ష్మి ఆమెను బలవంతంగా వాహనంలోకి ఎక్కించి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఎలాంటి తప్పు చేయని చంద్రబాబు నాయుడును అక్రమంగా జైలుకు తరలించడం ఏమిటని నిలదీశారు. పోలీసులకు, ఆమెకు మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ట్రాఫిక్ స్తంభించడంతో ఆమెను బలవంతంగా అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఆమెతోపాటు గుడిసె శ్రీరాములు, వి.ఎం.గోపాల్ ఉన్నారు.

టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో నిర్బంధం

ఆదోనిలో టిడిపి నాయకులను అరెస్టు చేసి టూ టౌన్ పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. డీఎస్పీ శివ నారాయణ స్వామి మాట్లాడుతూ... ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు ముమ్మరం చేశామన్నారు. శాంతియుతంగా నిరసన తెలిపాలని, ప్రజలను ఇబ్బందులు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉమాపతి నాయుడు, బుద్ధారెడ్డి, రామాంజనేయులు, గుడిసె కృష్ణమ్మ, గుడిసె శ్రీరాములు, వి.ఎం.గోపాల్, మురళిని పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. టిడిపి ఆలూరు నాయకులు వీరభద్ర గౌడ్‌ను మార్కెట్ యార్డ్ వద్ద అదుపులోకి తీసుకొని టూ టౌన్‌కు తరలించినట్లు పోలీసులు నిర్ధారించారు. **మంత్రాలయం**లో టిడిపి నాయకులను పోలీసులు ముందస్తు చేశారు. టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డిని ఎమ్మిగనూరు పట్టణంలోని తన స్వగృహంలో హౌస్ అరెస్టు చేశారు. ఆయన సోదరుడు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డిని కోసిగి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి, నాయకులు మల్లికార్జున రెడ్డి, అశోక్ రెడ్డి, చావిడి వెంకటేష్, ఎల్లారెడ్డి, విజయరామిరెడ్డి, చిలుకలడోన హనుమంతు, వట్టేప్ప గారి నరసింహ, ఏబు, రచ్చుమర్రి చిదానంద, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ బి.లక్ష్మన్న తదితరులను మంత్రాలయం ఎస్ఐ వేణుగోపాల్ రాజు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. మాధవరం గ్రామంలో టిడిపి నాయకులు అమర్‌నాథ్ రెడ్డి, కృష్ణ మోహన్ రెడ్డి, మరో నలుగురిని ఎస్ఐ కిరణ్ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లో ఉంచి సాయంత్రం వదిలేశారు. **హోళగుంద**లో టిడిపి ఆధ్వర్యంలో బంద్ ప్రశాంతంగా ముగిసింది. టిడిపి మండల కన్వీనర్ తిప్పయ్య నాయకులు ఆదం తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. **గోనెగండ్ల**లో టిడిపి శ్రేణులు ధర్నా, రాస్తారోకో, బంద్ లాంటి నిరసనలకు దిగకుండా ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో గోనెగండ్లలో ముందస్తు అరెస్టు చేశారు. తెల్లవారుజాము నుంచే ఎస్ఐ తిమ్మారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు మండల టిడిపి నాయకులకు ఫోన్లు చేసి వారి ఇళ్లకు వద్దకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. టిడిపి మండల కన్వీనర్ నజీర్ సాహెబ్, కోశాధికారి బేతాళ బడే సాహెబ్, సర్పంచి రంగముని, మండల ప్రధాన కార్యదర్శి తిరుపతయ్య నాయుడు, మైనార్టీ నాయకులు నూర్ అహ్మద్, అచ్చుగట్ల ఫక్రుద్దీన్, మదీనా, సిపిఐ మండల నాయకులు మద్దిలేటి నాయుడును ఉదయం 7 గంటల్లోపే అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. తెలుగు యువత మండల అధ్యక్షులు రంగస్వామి నాయుడు ఆధ్వర్యంలో వైఎస్ఆర్ సర్కిల్ సమీపంలో టైర్లకు మంట పెట్టి నిరసనకు దిగారు. సమాచారం అందుకున్న ఎస్ఐ, పోలీసులు రంగంలోకి దిగి రంగస్వామి నాయుడు, గాజులదిన్నె ప్రభాకర్, ఐరన్‌బండ బాష, టిఎన్ఎస్ఎఫ్ రమేష్ నాయుడు, కొత్తింటి ఫక్రుద్దీన్, రఫీక్, పూజారి లక్ష్మీకాంత్, రాంపురం లాల్‌ను పోలీసు స్టేషన్‌కు బలవంతంగా తరలించారు. అదుపులోకి తీసుకున్న వారిని మధ్యాహ్నం 3 గంటల తర్వాత వదిలిపెట్టారు.

నందవరం : టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ చేపట్టిన బంద్ మండలంలో ప్రశాంతంగా ముగిసింది. ఉదయాన్నే టిడిపి మండల నాయకులు మాధవ రావు దేశాయి, ముగతి ఈరన్న, గురురాజ్ దేశాయిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. 11 గంటల సమయంలో నాగలదిన్నె బ్రిడ్జిపై దాదాపు 100 మందితో నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డిని ఎమ్మిగనూరు రూరల్ సిఐ మోహన్ రెడ్డి, ఎస్ఐ తిమ్మయ్యలు అరెస్టు చేసి ఎమ్మిగనూరుకు తరలించారు. కేసులతో భయపడే ప్రసక్తే లేదని, కేవలం కక్ష సాధింపు కోసమే మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అరెస్టు చేశారని బీవీ తెలిపారు. టిడిపి కన్వీనర్ చిన్న రాముడు, నాగరాజ్ గౌడ్, ఖాసీం వలీ, రైస్‌మిల్ నారాయణరెడ్డి, గోపాల్, మిట్టా సోమపురం వీరేష్, ఐటిడిపి వీరేష్, భార్గవ్, బాలరాజు, దావీదు, జబ్బార్ పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రిమాండ్‌ను నిరసిస్తూ టిడిపి రాష్ట్రబంద్‌ను పోలీసులు ముందస్తు అరెస్టులతో నిర్వీర్యం చేశారు. సోమవారం తెల్లవారుజాము నుంచి టిడిపి శ్రేణులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసు స్టేషన్‌కు తరలించారు. మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్ రెడ్డిని నాగలదిన్నె వంతెన వద్ద పోలీసులు అరెస్టు చేశారు. తర్వాత హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధించారు. తన గృహం వద్ద చంద్రబాబు అరెస్టును, రిమాండ్‌ను నిరసిస్తూ నేలపై బైఠాయించారు. బీవీని తరలిస్తున్న సమయంలో టిడిపి శ్రేణులు పోలీసు వాహనాలకు అడ్డుపడి నిరసన తెలియజేయడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అడ్డుకున్న టిడిపి కార్యకర్తలను లాగి పడేశారు. పట్టణంలో డీఎస్పీ సీతారామయ్య, పట్టణ, రూరల్ సిఐలు మధుసూదన్, మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పట్టణ టిడిపి నాయకులు దయాసాగర్, కొండయ్య చౌదరి, కలీముల్లా, రంగస్వామి గౌడ్, కదిరికోట ఆదెన్నను అదుపులో తీసుకున్నారు. **ఆలూరు** నియోజకవర్గంలోని హాలహర్వి మండలం అర్ధగేరి గ్రామంలో టిడిపి ఇన్‌ఛార్జ్ కోట్ల సుజాతమ్మను పోలీసులు అరెస్టు చేశారు. మాజీ ఇన్‌ఛార్జ్‌లు వీరభద్రగౌడ్‌ను ఆదోనిలో, వైకుంఠం శివప్రసాద్, జ్యోతిని ఆలూరులో హౌస్ అరెస్టు చేశారు. స్థానిక నాయకులను, ముందస్తు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. టిడిపి మండల కన్వీనర్ అశోక్ ఆధ్వర్యంలో కొత్తబస్టాండ్ నుంచి బైక్ ర్యాలీతో అంబేద్కర్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. ఉదయం నుంచి పట్టణంలో బంద్‌కు మద్దతు తెలుపుతూ వ్యాపార దుకాణాలు బంద్ చేశారు. తర్వాత యథావిధిగా దుకాణాలు తెరిచారు. **దేవనకొండ** మండల నాయకులను ముందస్తు చర్యలో ఎస్ఐ భూపాలుడు హౌస్ అరెస్టు చేసి, స్టేషన్‌కు తరలించారు. టిడిపి శ్రేణులు ర్యాలీగా వచ్చి ఆందోళన నిర్వహిస్తుండగా ఎస్ఐ పోలీసు సిబ్బందితో టిడిపి ఆందోళనకారులను స్టేషన్‌కు తరలించారు. **కౌతాళం**లో టిడిపి సీనియర్ నాయకులు ఉల్లిగయ్య, జిల్లా ఉపాధ్యక్షులు చెన్న బసప్ప, ఉరుకుందలో కురుగోడును హౌస్ అరెస్టు చేశారు. తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ నాయుడును పోలీసు స్టేషన్‌కు తరలించారు. తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, జిల్లా కార్యదర్శి వెంకటపతి రాజు, మైనార్టీ నాయకులు టిప్పు సుల్తాన్, కొట్రేష్ గౌడ్ ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలను బంద్ చేసి నిరసన వ్యక్తం చేశారు. రాజానందు, రాజబాబు, జనసేన నాయకులు రామాంజి పాల్గొన్నారు. **పెద్దకడబూరు**లో టిడిపి ఇన్‌ఛార్జ్ పాలకుర్తి తిక్కారెడ్డి ఆదేశాలతో టిడిపి మండల అధ్యక్షులు ఈరన్న ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. రాష్ట్ర సాధికారిక మెంబర్ మల్లికార్జున, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి బొగ్గుల నరసన్న, దశరథ రాముడు, తలారి అంజి, మీసేవ ఆంజనేయులు, కుంటి ఈరన్న, నడిపి హనుమంతు, పవన్, మల్లకల్, నరసన్న, రాముడు, కురువ మల్లి, ఆదాం, ఇమ్మానుయేల్, దుబ్బన్న పాల్గొన్నారు. **ఆస్పరి** మండలంలోని టిడిపి నాయకులు కృష్ణ, వెంకటేశులు, తిమ్మన్న, సాలిసాబ్, నౌనేపాటి చౌదరి, ఎంపిటిసిలు నరసప్ప, రహీంతుల్లా, శ్రీనివాస్ గౌడ్, గోవింద్, రఘు, సోమలింగ, సుదర్శన, సతీష్ ఆధ్వర్యంలో బంద్ చేపట్టారు. మద్దతు తెలిపిన జనసేన, ఎంఆర్‌పిఎస్ నాయకులు అరవింద్, సంజప్ప, రామాంజినేయులును ఎస్ఐ వరప్రసాద్ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. అనంతరం టిడిపి నాయకులను విడుదల చేశారు. **కోసిగి**లో టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 5 గంటల నుంచి దుకాణాలు బంద్ చేయించి నిరసన వ్యక్తం చేశారు. ర్యాలీ చేస్తున్న టిడిపి నాయకులను ఎస్ఐ సతీష్ కుమార్ అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. టిడిపి మండల నాయకులు జ్ఞానేష్, నాడిగేని అయ్యన్న, వక్రాని వెంకటేష్, నాడిగేని రంగన్న, పంపాపతి, కొండగేని వీరారెడ్డి, భరద్వాజ్ శెట్టి, నాడిగేని వీరారెడ్డి, రవితేజ శెట్టి, నరసింహులు, కృష్ణారెడ్డి, మహాదేవ, కప్పయ్య, గౌవిగట్టు వీరయ్య, రామయ్య, గుండేష్, సల్మాన్ రాజు, డీలర్ నరసన్న, ఎంపిటిసి రాజు, మారేష్ ఉన్నారు. టిడిపి పార్లమెంట్ జిల్లా ఉపాధ్యక్షులు పి.ముతాత రెడ్డి, టౌన్ అధ్యక్షులు చింతలగేని నర్సారెడ్డిని పోలీసులు హౌస్ అరెస్టు చేశారు.

మంత్రాలయంలో పోలీసుల అదుపులో ఉన్న నాయకులు

కోసిగిలో...

దేవనకొండలో...

ప్రశాంతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేదా..?

ప్రజాశక్తి - చిప్పగిరి

టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అక్రమంగా జైలుకు తరలిస్తే బయటకొచ్చి నిరసన తెలిపే హక్కు కూడా తమకు లేదా టిడిపి కన్వీనర్ లాయర్ షేక్షావలీ ప్రశ్నించారు. సోమవారం చిప్పగిరిలో ఆయన మాట్లాడారు. నిరసన తెలిపేందుకు వస్తే పోలీసు స్టేషన్‌లో నిర్బంధించడం భావ్యమా అని ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో జగన్‌కు తగిన గుడిపాఠం చెబుదామని, ప్రజాస్వామ్యం విలువ ఏమిటో చూపిస్తామని హెచ్చరించారు. టిడిపి మండల మాజీ కన్వీనర్ కిష్టప్ప, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య, అంజి, మేకల రామాంజిని, అమరేష్, బెల్డోన సతీష్, శీన, దుగ్గన్న, ఉమాపతి పాల్గొన్నారు.

బాబును జైలుకు పంపడం బాధాకరం

- టిడిపి ఇన్‌ఛార్జ్ మీనాక్షి నాయుడు
- బాబు రిమాండ్‌పై భావోద్వేగం

ప్రజాశక్తి - ఆదోని

అవినీతి, మచ్చలేని నాయకులు చంద్రబాబు నాయుడుపై 73 ఏళ్ల వయస్సులో అనవసరంగా నిందలు వేసి జైలుకు తరలించడం బాధాకరమని మాజీ ఎమ్మెల్యే, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నాయుడు తెలిపారు. ఆయన కన్నీటి పర్యంతమై భావోద్వేగానికి గురయ్యారు. సోమవారం ఆదోనిలో చేపట్టిన బంద్‌లో మీనాక్షి నాయుడు పాల్గొనకుండా తెల్లవారుజాము నుంచే ఆయనను త్రీటౌన్ సిఐ రాజు, పోలీసు సిబ్బంది హౌస్ అరెస్టు చేశారు. మీనాక్షి నాయుడు ఇంటి వద్దనే మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడును ఈ వయస్సులో ఇలా ఇబ్బంది పెట్టడం తనకు బాధ వేస్తోందని తెలిపారు. ఎన్నో నేరాలు చేసిన వారు, ఎన్నో కేసుల్లో ఉన్న వారు బయట తిరుగుతున్నారని చెప్పారు. చంద్రబాబు నాయుడు పట్ల రాష్ట్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఎలా ప్రవర్తిస్తున్నారన్న విషయం యావత్తు ప్రపంచంలో చూస్తోందని తెలిపారు. ఈ వయసులో చంద్రబాబును జైలుకు పంపడం శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా నియోజకవర్గంలో చేపట్టిన బంద్‌కు సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న మీనాక్షి నాయుడు

వేతనాలివ్వలేని కళాశాల

- అధ్యాపకులను ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్న యాజమాన్యం
- సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారాయణస్వామి

ప్రజాశక్తి-ఆలూరు

ప్రయివేట్ కళాశాలలో అధ్యాపకులకు వేతనాలు ఇవ్వకుండా ఆర్థికంగా ఇబ్బందులు పెడుతున్న కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కెపి.నారాయణ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆలూరులోని శ్రీరాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో అధ్యాపకులకు రెండు నెలలైనా వేతనాలు ఇవ్వకపోవడం ఏమిటని ప్రశ్నించారు. కళాశాలలో 16 మంది అధ్యాపకులు పని చేస్తున్నారని, నాన్ టీచింగ్ సిబ్బంది చేయాల్సిన పనులను అధ్యాపకులకు అప్పగిస్తున్నారని తెలిపారు. అధ్యాపక వృత్తిని అవమాన పరుస్తూ, కార్మిక చట్టాలను తుంగలో తొక్కుతున్నారని చెప్పారు. ప్రభుత్వానికి మాత్రం ప్రతినెలా జీతాలు చెల్లిస్తున్నట్లు దొంగ లెక్కలు చూపుతూ రెండు నెలలు గడిచినా అధ్యాపకులకు జీతాలివ్వలేని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. అధ్యాపకులతో వెట్టిచాకిరి చేయించుకోకుండా విద్యార్థులను నేరుగా పరీక్షలకు పంపిస్తే సరిపోతుందని విమర్శించారు. విద్యా శాఖాధికారులు కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్మిక చట్టాలు పటిష్టంగా అమలయ్యే విధంగా ప్రతి కళాశాలలోనూ, పాఠశాలలోనూ కనీస వేతన చట్టాలు అమలు జరిగేలా చూడాలని డిమాండ్ చేశారు. లేకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

'ప్రతి ఒక్కరికీ వ్యాక్సినేషన్ లక్ష్యం'

ఆదోని : ప్రతి ఒక్కరికీ వ్యాక్సినేషన్ వేసి ఆరోగ్యంగా ఉంచడమే ప్రపంచ ఆరోగ్య సంస్థ లక్ష్యమని ఆ సంస్థ ప్రతినిధి డాక్టర్ రవి కాంత్ తెలిపారు. సోమవారం పట్టణంలోని ఇందిరానగర్ సబ్ సెంటర్ పరిధిలోని వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా పట్టణంలోని ఎస్‌కెడి కాలనీ 21వ వార్డు సచివాలయంలోని జరిగిన వ్యాక్సినేషన్ వివరాలను అక్కడ ఎఎన్ఎం ప్రమీలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రవికాంత్ మాట్లాడారు. ఐదేళ్లలోపు చిన్నారులకు, గర్భిణులకు తప్పకుండా వ్యాక్సినేషన్ వేయించి ఆరోగ్యంగా ఉండేలా అప్రమత్తం చేస్తున్నామని తెలిపారు. ఇంటింటి సర్వే ప్రక్రియ జరుగుతోందని, ఎవరూ మిస్ కాకుండా వివరాలు సేకరించి వ్యాక్సినేషన్ వేయిస్తామని వివరించారు.

సిపిఎం నాయకుల అరెస్టు

పెద్దకడబూరు : మండలంలో టిడిపి చేపట్టిన రాష్ట్ర బంద్‌లో భాగంగా పోలీసులు సిపిఎం నాయకులు అరెస్టు చేశారు. సోమవారం సిపిఎం మండల కార్యదర్శి ముక్కన, రైతు సంఘం జిల్లా నాయకులు పరమేష్, డివైఎఫ్ఐ మండల కార్యదర్శి దేవదాసును ఎస్ఐ మహేష్ కుమార్ ముందస్తుగా అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. శాంతిభద్రతల నేపథ్యంలో అదుపులోకి తీసుకుంటున్నామని, సహకరించాలని ఎస్ఐ కోరారు.

వైభవంగా ఈరన్న స్వామి పల్లకి మహోత్సవం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి పల్లకి మహోత్సవం వైభవంగా సాగింది. సోమవారం అశేష భక్తజన సందోహంతో ఉరుకుంద క్షేత్రం విద్యుద్దీప కాంతులతో కళకళలాడింది. ఈరన్న స్వామి మూలవిరాట్‌ను సోమవారం తెల్లవారుజాము నుంచి చిరుతపల్లి, మల్లన్న హట్టి, కరణి, తిప్పలదొడ్డి, కోసిగి మండలంలోని కందుకూరు గ్రామ సమీపంలోని తుంగభద్ర నదికి చేరుకున్నారు. పాలకమండలి అధ్యక్షులు నాగరాజు గౌడ్, దేవాలయ సహాయ కమిషనర్ వాణి, సూపరింటెండెంట్లు రామ్మోహన్, వెంకటేష్, మల్లికార్జున, ప్రధాన అర్చకులు ఈరప్ప స్వామి, వేద పండితుల ఆధ్వర్యంలో ఈరన్న స్వామికి తుంగభద్ర జలాలతో అభిషేకం చేశారు. అనంతరం ఆంధ్ర, కర్ణాటక నుంచి వచ్చిన వేలాది మంది భక్తుల సమక్షంలో ప్రత్యేక పూజలను చేపట్టారు. తుంగభద్ర తీరంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కందుకూరు, తిప్పలదొడ్డి, కరణి, మల్లన్న హట్టి, చిరుతపల్లి గ్రామాల నుంచి ఉరుకుంద గ్రామానికి స్వామివారి పల్లకి చేరుకుంది.

పల్లకి మహోత్సవంలో పాల్గొన్న అధికారులు

కోసిగి : మండలంలోని కందుకూరు గ్రామం తుంగభద్రనది తీరాన జరుగుతున్న పల్లకి మహోత్సవానికి వైసిపి రాష్ట్ర యువజన నాయకులు వై.ప్రదీప్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా ప్రదీప్ రెడ్డికి ఉరుకుంద ఈరన్న స్వామి దేవస్థానం బోర్డు అధ్యక్షులు నాగరాజు గౌడ్, ఆలయ అర్చకులు ఈరప్ప స్వామి, మండల కన్వీనర్ బెట్టనగౌడ్ స్వాగతం పలికారు. పల్లకి మహోత్సవం సందర్భంగా కందుకూరు గ్రామంలో పరుగు పందెం, ఇసుక బస్తాలు ఎత్తడం, గుండు ఎత్తడం, లాంగ్ జంప్ వంటి క్రీడా పోటీలు నిర్వహించి, గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ఎంపిపి ఈరన్న, నాడిగేని నాగరాజు, జగదీష్ స్వామి, దొడ్డి నర్సన్న, నరసింహులు గౌడ్, కాల్వ లక్ష్మయ్య, వీరస్వామి, కందుకూరు తాయన్న, ఎంపిటిసి మల్లయ్య, మాజీ ఎంపిటిసి రమేష్, పి.వెంకటేష్, పెద్దబొంపల్లి అంజి, దేవస్థానం బోర్డు సభ్యులు మల్లికార్జున గౌడ్ పాల్గొన్నారు.

పేదోడి సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్ : సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

పేదోడి సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని టిటిడి పాలకమండలి సభ్యులు, వైసిపి నాయకులు, ఎమ్మిగనూర్ ఆర్‌టిసి డిపో ఎంప్లాయిస్ యూనియన్ గౌరవాధ్యక్షులు వై.సీతా రామిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో గల సూగూరు రహదారిలో ఉన్న జగనన్న కాలనీలో హేమావతి అనే లబ్ధిదారురాలు నూతనంగా నిర్మించిన గృహ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. హేమావతి సీతారామిరెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశం చేశారు. అనంతరం సీతారామిరెడ్డికి పూలమాల వేసి శాలువా కప్పి సన్మానించారు. సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, వ్యవసాయ సలహా మండలి సభ్యులు మల్లికార్జున, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి వెంకటేష్ శెట్టి, జనార్ధన్ రెడ్డి, శివకుమార్, వీరారెడ్డి, భాస్కర్ ఉన్నారు.

పాల్గొన్న సీతారామిరెడ్డి

అభిమానుల కోరిక మేరకు ఒక రోజు ముందే

ప్రదీప్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

అభిమానుల కోరిక మేరకు వైసిపి రాష్ట్ర యువజన విభాగం నాయకులు వై.ప్రదీప్ రెడ్డి పుట్టినరోజు వేడుకలను ఒక రోజు ముందుగానే జరుపుకున్నారు. సోమవారం ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో ప్రదీప్ రెడ్డి అభిమానుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈనెల 12న పుట్టినరోజు కాగా శ్రీశైల భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దర్శనార్థం వెళ్తున్న నేపథ్యంలో పుట్టిన రోజు వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా అభిమానులు పూలమాలలు వేసి శుభాకాంక్షలు తెలిపారు. అభిమానులు శేఖర్ స్వామి, వీరేష్ పాల్గొన్నారు.

శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు

ప్రతిభ చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీల్లో 'వందగల్లు' ప్రతిభ

కోసిగి : మండలంలోని వందగల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చాటారు. ఆగస్టు 30న కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన జిల్లా జంప్ రోప్ ఎంపిక పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. సబ్ జూనియర్ బాలుర విభాగంలో 5వ తరగతి విద్యార్థి సంతోష్ కుమార్, బాలికల విభాగంలో 5వ తరగతి విద్యార్థి కీర్తన, 6వ తరగతి విద్యార్థి శిరీష, గీతాంజలి, 8వ తరగతి విద్యార్థి షర్మిల రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 9, 10న గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపారు. కీర్తన, గీతాంజలి కాంస్య పతకాలు సాధించగా, సంతోష్ కుమార్ రజత పతకం సాధించారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో రాణించడం గర్వంగా ఉందని ప్రధానోపాధ్యాయులు గోవింద రాజు సోమవారం తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

ఆగని అక్రమ అవ్వకాలు...

- నాకేని చెరువు వంకలో ఇసుక తవ్వకాలు

ప్రజాశక్తి - కోసిగి

మండలంలోని నాకేని చెరువు వంకలో ఇసుక అక్రమ తవ్వకాలు ఆగడం లేదు. ట్రాక్టర్లతో రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అక్రమంగా తవ్వి తరలిస్తుండడంతో దారి గుంతలు పడి అధ్వానంగా తయారైంది. వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఖాదర్ సాబ్, చింతలగేని సూరి, పరసాని లక్ష్మన్న, నాగరాజు, సిద్ధప్ప, నరసింహులు, గోపాల్, నాగిరెడ్డి, నిమ్మయ వీరేష్, ఇంకా 40 మంది రైతులు తెలిపారు. సోమవారం కోసిగి సమీపంలోని నాకేని చెరువు వంకలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఓ ట్రాక్టర్‌ను పట్టుకొని వారిపై వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. ఈ దారి గూండా రోజూ 300 ఎకరాలకు సంబంధించిన 100 కుటుంబాల రైతులు ద్విచక్ర వాహనాలు, ఎద్దుల బండి, కాలినడకన వెళ్తారని తెలిపారు. వారికి ఇబ్బందులు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులకు చెప్పినా చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ద్విచక్ర వాహనంపై ఎరువులు లాంటివి తీసుకొచ్చేటప్పుడు, ఈ దారిలో పొలానికి వెళ్లేటప్పుడు ఇబ్బందులు తప్పడం లేదని తెలిపారు. అక్రమార్కులు పగలు వంకను పరిశీలించి రాత్రి పూట ట్రాక్టర్లు పెట్టి ఇసుక తవ్వి తరలిస్తున్నారని చెప్పారు. దారిని గుంతల మయంగా చేస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోకపోతే రైతులతో కలిసి రోడ్లపై ఆందోళన చేపడతామని రైతులు హెచ్చరించారు.

చెరువు వంకలో దారిని చూపిస్తున్న రైతులు

రాష్ట్రస్థాయి పోటీల్లో 'నేషనల్' ప్రతిభ

ప్రజాశక్తి - ఆదోని

గుంటూరు జిల్లా తెనాలిలో ఈనెల 9, 10న జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో ఆదోనిలోని నేషనల్ కళాశాల విద్యార్థి పశువుల రామకృష్ణ ప్రతిభ చాటి కాంస్య పతకం సాధించినట్లు కరస్పాండెంట్ గోపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ ఫణి శేఖర్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడారు. కర్నూలు అవుట్‌డోర్ స్టేడియంలో ఆగస్టు 30న జరిగిన జూనియర్ విభాగం జిల్లా జంప్ రోప్ ఎంపిక పోటీల్లో పాల్గొని రామకృష్ణ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పతకం సాధించిన విద్యార్థిని, తర్ఫీదు ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులను వారు అభినందించారు.

దొంగతనం కేసును ఛేదించిన పోలీసులు

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని పెద్దతుంబలంలో ఈనెల 8న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదురుగా రవి నాయక్ ఇంట్లో జరిగిన దొంగతనం కేసు నిందితులు హెచ్.మల్లికార్జున నాయక్‌ను అరెస్టు చేసినట్లు పెద్దతుంబలం ఎస్ఐ చిన్న పీరయ్య తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. సిరిగుప్ప చెక్‌పోస్ట్ వద్ద అరెస్టు చేసి నిందితుడు దొంగలించిన మొత్తం 5 తులాల బంగారు ఆభరణాలు, వెండి ఆభరణాలు సుమారు 9 తులాలను రికవరీ చేసినట్లు తెలిపారు. నిందితుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

IN THE COURT OF IIND ADDL. DISTRICT JUDGE CUM MOTOR ACCIDENT CLAIMS TRIBUNAL, KURNOOL AT: ADONI
I.A.NO. 968/2023 IN M.V.O.P. No.27/2021
Vadde Raghu Minor, R/ by his father Vadde Gokari as his natural Guardian. ...Petitioner
VS
1.Kathif Yunusbasha and 2 Others ...Respondents
NOTICE TO THE RESPONDENTS NO.2
To
Respondent No.2.
B. Keshavaiah S/O B. Sreeramulu, Hindu, Aged about 42 Years, owner of TATA Magic Gas auto bearing No. AP 21 TB 2659, H. No. 2-280, Gonegandla Village and mandal, Kurnool Dist.
Where as the above named petitioner filed petition Under Section 166 (1) (a) of Motor Vehicles Act for claiming compensation against you for the injuries sustained by the minor petitioner. Hence you are hereby required to appear before this court on 12.10.2023 at 10.30 AM in person or through an advocate and answer the said claim petition, otherwise the matter will be decided exparte.
(By Court Order)
V. Lakshmaiah, B. Com. B.L., Advocate, Yemmiganur Town, Kurnool Dist.

16, 17న రవాణా కార్మికుల రాష్ట్ర సదస్సు

- సిఐటియు డివిజన్ కార్యదర్శి రాముడు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 16, 17న కర్నూలులో చేపట్టే రవాణా కార్మికుల రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు డివిజన్ కార్యదర్శి బి.రాముడు, ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ అండ్ ఫెడరేషన్ (సిఐటియు) నాయకులు బి.రాజు, ఎమ్‌డి.యూసుఫ్ కోరారు. సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీ పడి రవాణా రంగ వాహనాలపై అనేక అపరాధ రుసుములు వసూలు చేస్తున్నాయని విమర్శించారు. జిఒ 27 ద్వారా పెనాల్టీలు మోయలేని భారాలు అవుతున్నాయన్నారు. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా కార్మికుల వాహనాలు అమ్ముకోవాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు. రవాణా రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు దాటిన డ్రైవర్లకు నెలకు రూ.6 వేల పింఛను ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం 16, 17న కర్నూలు నగరంలోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సదస్సుకు పెద్ద ఎత్తున కార్మికులు హాజరుకావాలని కోరారు. ఆటో, మినీలారీ, జీపు కార్మికులు బి.కృష్ణ, ఎస్.షబ్బీర్, ఎమ్‌డి.మోహన్ దాస్, మోహన్, రామాంజి, సత్తార్ బాష, దాదా బాష, మహ్మద్, శేఖర్, పి.రాజు, ఈరన్న గౌడ్, భీమ్ రావు పాల్గొన్నారు.

ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు, ఆటో కార్మికులు

బంద్ ప్రశాంతం..

మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డిని అరెస్టు చేస్తున్న పోలీసులు

- ఎక్కికక్కడే నాయకుల నిర్బంధం - జన జీవనంపై చూపని ప్రభావం
- యాథేచ్చగా బస్సులు ఆటోలు, వాహనాలు

ప్రజాశక్తి - విలేకరులు

నంద్యాల కలెక్టరేట్ : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు న్యాయస్థానం విధించిన రిమాండ్‌కు వ్యతిరేకంగా టిడిపి పిలుపునిచ్చిన రాష్ట్ర బంద్.. నంద్యాల పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతంగా సాగింది. టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉదయాన్నే 6 గంటలకే రోడ్లపైకి వచ్చారు. మాజీ ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి, ఎన్ఎండి ఫిరోజ్‌లు తన అనుచరులు, కార్యకర్తలతో కలిసి పద్మావతి నగర్, మున్సిపల్ కార్యాలయం మీదుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీగా వెళ్లి బస్సులు బయటకు వెళ్లకుండా ఆదుకున్నారు. అలాగే ఆటోలు, వాహనాలు రోడ్ల పైన తిరుగకుండా బంద్ చేయించారు. విషయం తెలుసుకున్న పోలీసులు నంద్యాల డిఎస్పీ మహే శ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకొని భూమా బ్రహ్మానందరెడ్డి, ఫిరోజ్, కౌన్సిలర్‌లను, నాయకులను అదుపులోకి తీసుకోని అరెస్టు చేసి భూమా బ్రహ్మానందరెడ్డిని టూ టౌన్‌కు తరలిం చారు. అలాగే ఎన్ఎండి ఫిరోజ్‌ను వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉదయం 9 గంటలకే టిడిపి నేతలను పోలీసులు అదుపులోకి తీసుకోవడంతో బంద్ ప్రభావం కనపడలేదు. స్వచ్ఛందంగా పాఠశాలలు మునివేసినప్పటికీ.. మిగి లిన వ్యాపార సముదాయలు యధావిధిగా తెరుచు కున్నాయి. ఆర్టీసీ బస్సులు యథేచ్ఛగా తిరిగాయి. అలాగే పట్టణంలో ఆటోలు, వాహనాలును తిప్పారు. జన జీవనంపై బంద్ ప్రభావం అంతగా కనపడలేదు. వన్ టౌన్ ఏరియాలో బులియన్ మర్చంట్ అసోసియేషన్ నంద్యాల అధ్యక్షులు గంగిశెట్టి విజయకుమార్ ఆధ్వర్యంలో నంద్యాల పట్టణంలోని బంగారు షాపులు బంద్ చేశారు.

టైర్లు కాల్చి నిరసన.. నాయకులు అరెస్టు కావడంతో కింది స్థాయి టిడిపి నేతలు ఫరూక్ నగర్, సాయిబాబా నగర్ ల వద్ద పాత టైర్లు తగులబెట్టి తమ నిరసనను తెలిపారు. బంద్‌లో కౌన్సిలర్‌లు మహబూబ్ బాషా, నాగార్జున,మాజీ కౌన్సిలర్ మన్నే కృపాకర్, టిడిపి నాయకులు హెచ్‌ఎం అల్తాఫ్, బంగారు షాపుల యజమానులు సిలువేరి వేణు, వీరయ్య, సంఘ శీను, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

నందికొట్కూరులో టిడిపి నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

బండి ఆత్మకూరు: టిడిపి నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

ఆళ్లగడ్డ: చంద్రబాబు నాయుడికి విధించిన రిమాండ్‌ను వ్యతిరేకిస్తూ చేపట్టిన బంద్ ఆళ్లగడ్డలో బందు పాక్షికంగా జరిగింది. ఆళ్లగడ్డలో మాజీ మంత్రి భూమా అఖిలప్రియను పోలీసులు గృహ నిర్బంధంలో ఉంచారు. 144 సెక్షన్‌తో పాటు పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున డి.ఎస్.పి వెంకటరామయ్య ఆధ్వర్యంలో ఆళ్లగడ్డ పట్టణ సిఐ రమేష్ బాబు ఎస్ఐ వెంకటరెడ్డిలు పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అందులో భాగంగా తెలుగుదేశం పార్టీ నాయకులను ఇతర రాజకీయ పార్టీ నాయకులను ముందస్తు చర్యల్లో భాగంగా ఆళ్లగడ్డ సబ్ డివిజన్ పరిధిలో దాదాపు 60 మంది నాయకులను అదుపులోకి తీసుకున్నారు. ఆళ్లగడ్డలో బస్సులు, అన్ని సర్వీసులు. వాహనాలు అన్ని ప్రాంతాలకు వెళ్లాయి. వ్యాపార సముదాయాలు , దుకాణాలు తెరిచారు. బంద్‌కు మద్దతు తెలుపుతూ పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో జనసేన ఆళ్లగడ్డ నియోజకవర్గం ఇన్చార్జి మైలేరి మల్లయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి జనసేన నాయకులు నిరసన వ్యక్తం చేస్తున్న సమయంలో జనసేన నా యకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించగా.. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి శంసుల్ హక్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **ఆత్మకూరు :** టిడిపి నేతలు ఉదయం నాలుగు గంటల నుండి ఆర్టిసి బస్టాండ్ వద్ద బయటకు రాకుండా బంద్ నిర్వహించారు. ఆత్మకూరు సిఐ నాగభూషణం ఆధ్వర్యంలో పోలీసులు పెద్ద ఎత్తున రంగ ప్రవేశం చేసి నాయకులను అరెస్టు చేసి బస్సులను బయటకు వదిలారు. ఆత్మకూరు పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు కళాశాలలు పాఠశాలలు స్వచ్ఛందంగానే బందును పాటిస్తూ పాఠశాలను మూసి వేశారు. టిడిపి కార్యకర్తలు వంతులు వారుగా రోడ్లపైకి వచ్చి రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో శ్రీశైలం దేవస్థానం మాజీ చైర్మన్ శివరాం రెడ్డి, సీనియర్ న్యాయవాది గోవిందరెడ్డి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కలిముల్లా, టిడిపి నాయకులు వేణుగోపాల్, శివ ప్రసాద్ రెడ్డి, నాగూర్ ఖాన్, తదితరులు ఉన్నారు. **ప్యాపిలి :** టిడిపి నాయకులు అంకిరెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, రామసుబ్బయ్య, రాంమోహన్, చిన్న సుంకయ్య, తదితరులు బస్టాండ్ ఆవరణలో ధర్నా నిర్వహిం చగా పోలీసులు అడ్డుకొని స్టేషన్‌కు తరలించారు. **పగిడ్యాలలో ..** బస్టాండులో టిడిపి నాయకులు ఓగిలి శ్రీను , పుల్యాల వాసు రెడ్డి, దామోదర్ రెడ్డి , సిరి గౌడ్, ఆకుల శీను, బాబు, బోయ సన్న వాహనాల రాకపోకలను నిలుపుదల చేసి ధర్నా నిర్వహించారు. **పాములపాడులో..** ఎస్సై జి అశోక్ ముందస్తుగా పాములపాడు మండల తెలుగు యువత అధ్యక్షుడు మధు కృష్ణ, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి రాయపాటి గోవిందు, క్లస్టర్ ఇంఛార్జి బండ్లమూరి చంద్రశేఖర్‌లను అదుపులోకి తీసుకొన్నారు. **బనగానపల్లె :** పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి నివాసంలో ఆయన సతీమణి బిసి ఇందిరాను ఎస్సై రామిరెడ్డి ఆధ్వర్యంలో హౌస్ అరెస్ట్ చేశారు. టిడిపి రాష్ట్ర బంద్‌కు పిలుపు నివ్వడంతో బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి స్వగృహంలో మాజీ ఎమ్మెల్యే బీసీ సతీమణి బీసీ ఇందిరాను, మాజీ ఎమ్మెల్యే బీసీ సోదరులు పట్టణ మాజీ సర్పంచ్ బీసీ రాజారెడ్డి, టిడిపి నాయకులు బీసీ రామనాథ్ రెడ్డిలను పోలీసు లు హౌస్ అరెస్టు చేశారు. బనగానపల్లె నియోజక వర్గంలోని టిడిపి ముఖ్య నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టులు చేసి అదుపులోకి తీసుకున్నారు.

- పట్టణంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. టిడిపి, జనసేన, సిపిఐ, సిపిఎం, బిజెపి నాయకు లను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రాష్ట్ర వ్యాప్తంగా ముందస్తు అరెస్టుల్లో భాగంగా **మిగతా 6లో..**

ఆకుకూరలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్

చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రోత్సహించండి

- జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జిల్లాలో చిరుధాన్యాల ఉత్పత్తులను గణనీయంగా పెంచాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ సంబంధిత రైతులను ప్రోత్సహించారు. సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్లోని వైయస్సార్ సెంటినరీ హాల్ ఆవరణలో చిరుధాన్యాల విక్రయ ఉత్పత్తులను జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్, జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డిలు పరిశీలించారు. మిల్లెట్ సంవత్సర సందర్భంగా జిల్లాలో చిరు ధాన్యాల సాగు విస్తీర్ణ స్థాయిని విస్తృతంగా చేపట్టా లని జిల్లా కలెక్టర్ రైతులను ప్రోత్సహించారు. వర్షభావ పరిస్థితుల్లో చిరుధాన్యాల ఉత్పత్తులు బాగా వస్తాయన్నారు. డిఆర్డిఎ, రైతు సాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పంట ఉత్పత్తుల, తినుబండారాల స్టాళ్లను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఇతర అధికారులు పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షించే చిరుధాన్యాల ఉత్పత్తులను ప్రోత్సహించాలని కలెక్టర్ సంబంధిత అధికారులను సూచించారు.

నేడు నంద్యాలకు పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్ లక్ష్మణరావు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

పిడిఎఫ్ ఫ్లోర్ లీడర్ కెఎస్ లక్ష్మణరావు మంగళవారం నంద్యాలకు రానున్నారు. నంద్యాలలో జరిగే మణిపూర్ హింసకాండ ఉమ్మడి పౌరస్మృతి సదస్సులో ఆయన పాల్గొననున్నారు. నంద్యాల లోని రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరి యంలో ఈ సదస్సు సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ రామ రాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమస్యలో మేధావులు విద్యావంతులు అభ్యుదయ వాదులు ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు యువకులు ఉపాధ్యాయులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అతివేగమే.. యమపాశమై..

- రోడ్డు ప్రమాదంలో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - మహానంది

అతివేగానికి నిండు మూడు ప్రాణాలు పోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని బోయలకుంట్ల మెట్ట వద్ద ఆదివారం రాత్రి సమయంలో ఆటో బొలెరో వాహనం ఢీకొన్న ఘటనలో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు నంద్యాల మండలం మిట్నల గ్రామానికి చెందిన పరదేశి లక్ష్మి (40), పరదేశి బంగారు రాజు (27), గోస్పాడు మండలం యాలూరు గ్రామానికి చెందిన నేస సుబ్బమ్మ (45), మార్తమ్మ, ఎనిమిదేళ్ల బాలుడు తిమ్మరాజు బిల్లాలా పురం వెళ్లారు. అక్కడి నుండి కుటుంబ పంచాయతీ కోసం ఎంసీ ఫారం గ్రామంలోని మనోహర్ ఇంటికి వచ్చారు. రాత్రి 9 గంటల 30 నిమిషాలు సమయంలో తిరుగు ప్రయాణమై బోయల కుంట్ల మెట్ట వద్దకు చేరుకోగానే చేపల లోడుతో ప్రకాశం జిల్లాకు వెళ్తున్న బొలెరో వాహనం ఆటో పరస్పరం అతివేగంతో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మేష సుబ్బమ్మ, పరదేశి లక్ష్మి, పరదేశి బంగారు రాజు అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

మూర్తమ్మ, తిమ్మరాజు గాయపడ్డారు. వీరిని స్థానికులు నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మహానంది ఎస్ఐ నాగేంద్ర ప్రసాద్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తమై నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చెల్ల చెదరుగా పడిన మృతదేహాలు

చలమ అటవీ రేంజిలో .. కొరబడిన నిఘా..

ప్రజాశక్తి - రుద్రవరం

- దుండగులు అడవిలో సంచారం..
- మూఠాలు అటవీ సంపద తరలింపు...
- పలు చోట్ల నెమలి ఈకల గుర్తింపు
- వన్య ప్రాణుల మాంసము తరలింపు ?
- పట్టణాలలో ఫారెస్ట్ అధికారుల నివాసం
- ఇష్టానుసారంగా కిందిస్థాయి సిబ్బంది విధులు

మూటలతో గొడ్డలి లతో అడవుల్లో తిరుగుతున్న వ్యక్తులు

నంద్యాల జిల్లా చలమ ఫారెస్ట్ రేంజ్ పరిధిలో అటవీ అధికారుల నిఘా కొరవడింది. పెద్ద కంబలూరు, కోటకొండ, శ్రీరంగాపురం, తదితర గ్రామాల సమీపంలో ఉన్న నల్లమల అటవీ ప్రాంతం నుంచి కలప, వెదురు, బొగ్గు, వన్యప్రాణుల మాంసము తరలిస్తున్నట్లు ఆరోపణలు రావడమే కాకుండా కొన్ని ఆనవాలు ప్రత్యేక్షంగా కనబడుతున్నాయి. చలమ అటవీరేంజ్ పరిధిలోని నల్లమల్ల అడవుల్లో గుర్తుతెలియని వ్యక్తులు సంచరిస్తూ విలువైన కలపతో పాటు ఇతర అటవీ ఉత్పత్తులను గుట్టుచప్పుడు కాకుండా పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఫారెస్ట్ అధికారుల నిఘా కొరవడడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇష్టానుసారంగా అడవుల్లోకి ప్రవేశించి నేరాలకు పాల్పడుతున్నట్లు సమాచారం. గుర్తుతెలియని వ్యక్తులు సంచరించినచోట నెమలి ఈకలు పడి ఉండటాన్ని చూస్తే వారు నెమళ్లను వేటాడి చంపి వాటి మాంసాన్ని మూటల్లో కట్టుకొని సైకిళ్లపై తరలిస్తున్నట్లు పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అటవీ ప్రాంతంలో కొన్నిచోట్ల కట్టెలు పేర్చి మంటలు వేస్తూ ఉండడంతో కలపను బొగ్గులుగా తయారు చేస్తున్నారా? అనే అనుమానాలు బలపడుతున్నాయి. ఫారెస్ట్ సిబ్బంది తమకు కేటాయించిన ఏరియాలలో విధులు నిర్వహించకపోవడంతో అడవిలోకి గుర్తు తెలియని వ్యక్తులు ఇష్టానుసారంగా ప్రవేశించి అడవుల్లో దొరికే కలప ఇతర అటవీ ఉత్పత్తులను తీసుకు వెళ్తున్నారు. అడవుల్లో అనుమానాస్పదంగా తిరుగుతూ జంతువులను వేటాడి వాటి మాంసాన్ని పట్టణాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న కొన్ని ముఠాలు అడవిలో తిరుగుతున్నాయి. ఫారెస్ట్ ఉన్నతాధికారులు నల్లమల అడవుల్లో ఉన్న విలువైన అటవీ సంపద, వన్య ప్రాణులు అంతరించిపోకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉందని నల్లమల అడవి సమీపాన ఉన్న ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

గుట్టగా పేర్చిన వంట చెరుకు

వ్యక్తులు సంచరించిన చోటపడి ఉన్న నెమలి ఈకలు

గుర్తుతెలియని వ్యక్తులు సైకిళ్లపై మూటల్లో గుర్తుతెలియని పదార్థాలను తీసుకెళుతున్న దృశ్యం

గుర్తు తెలియని వ్యక్తులు వంట చెరుకును కాలుస్తున్న దృశ్యం

నల్లమల అడవుల్లోని తెలుగు ప్రధాన కాలువలో గుర్తుతెలియని వ్యక్తులు

పంటను దున్నేసిన కౌలు రైతులు

- తీవ్రంగా నష్టపోయామని ఆవేదన

ప్రజాశక్తి - పాములపాడు

మండలంలోని మిట్ట కందల గ్రామానికి చెందిన కౌలు రైతులు మంగలి వెంకటరమణ, మంగలి వెంకటేశ్వర్లు అదే గ్రామానికి చెందిన రైతుల నుండి తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకొని శరీ నాలుగున్నర ఎకరా చొప్పున రూ.లక్ష 30 వేలు కౌలు చెల్లించారు. ఎకరాకు రూ.30 వేల చొప్పున పెట్టుబడి పెట్టి మొక్కజొన్న పంటను సాగు చేయగా.. మొదట జూలై నెలలో వర్షం కురిసి నప్పటికీని ఆగస్టు నెలలో నెల రోజుల పాటు వర్షం కురువక పంట ఎలాంటి ఎదుగుదల లేక పూర్తిగా దెబ్బ తినడంతో రైతులు రోటర్లతో పంటను చెడ గొట్టారు. రైతులు మాట్లాడుతూ ప్రకృతి వైఫల్యంతో వర్షాలు లేక విత్తిన పంట చేతికి రాలేదని వాపో యారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు.

మొక్కజొన్నను దున్నేసిన కౌలు రైతులు

రైతాంగాన్ని ఆదుకోవాలి

- పి సుధాకర్, జిల్లా కౌలు రైతు సంఘం కార్యదర్శి.

ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితులు అనుకూలత లేక పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. పాములపాడును కరువు మండలంగా ప్రకటించాలి. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. గ్రామాలను యూనిటీగా తీసుకొని కరువు చర్యలు చేపట్టాలి.

ఐలమ్మ, రామకృష్ణ ఆశయాలతో పని చేద్దాం : ఆర్‌విఎస్

ప్రజాశక్తి - పాములపాడు

ఐలమ్మ రామకృష్ణల చిత్ర పటాలకు నివాళ్లి అర్పిస్తున్న ఆర్‌విఎస్ నాయకులు

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వీరనారి అగ్ని కనిక చాకలి ఐలమ్మ, సత్తెనపల్లి రామకృష్ణల ఆశయాలతో పని చేద్దాం అని వక్తలు పేర్కొ న్నారు. సోమవారం నాడు చాకలి ఐలమ్మ, విద్యుత్ పోరాటంలో అమరుడైన సత్తనపల్లి రామకృష్ణ వర్ధంతి సభ ఏపీ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో మండలం లోని సిపిఎం కార్యాలయం నందు నిర్వహించారు. ఈ సందర్భంగా వారి చిత్రపటానికి పూలమాలు వేసి అర్పించారు. రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలో ఏపీ రజకవృత్తిదారుల సంఘం రాష్ట్ర నాయకులు చందావారి వెంకటేశ్వర్లు, మండల నాయకులు ధర్మయ్య, కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు స్వామన్న మాట్లాడారు. చాకలి ఐలమ్మ సాయిధరైతంగా పోరాటంలో తన వంతు పాత్ర పోషించారని అన్నారు. విద్యుత్ ఉద్యమంలో సత్తనపల్లి రామకృష్ణ పోరాటం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ వాజ్ పార్టీ నాయకులు స్వాములు, శివ భారతి నాయకులు షర్ఫుద్దీన్ అలీ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి వెంకటేశ్వరరావు, నాయకులు ఏ. రణధీర్, సిఐటియు జిల్లా నాయ కులు డి. రామ్ నాయక్,ఏ పి రజక వృత్తి దారుల సంఘం నాయకులు మద్దిలేటి, లింగస్వామి, లింగన్న, చిన్న లింగస్వామి, రామకృష్ణ, శ్రీను, తిరుపతయ్య,తదితరులు పాల్గొన్నారు.

వైసిపికి రోజులు దగ్గరపడ్డాయి

- మాజీ మంత్రి భూమా అఖిలప్రియ

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

వైసిపి ప్రభుత్వానికి చివరి రోజులు దగ్గర పడ్డాయని మాజీ మంత్రి భూమా అఖిలప్రియ విమర్శించారు. సోమవారం చంద్రబాబు అరెస్టు, రిమాండ్‌కు నిరసనగా టిడిపి రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో భూమా అఖిలప్రియను పోలీసులు గృహ నిర్బంధం విధించగా ఆమె విలేకరులకు తమ సందేశాన్ని వీడియో రూపంలో పంపారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు అరెస్ట్ దురదృష్టకర సంఘటనగా ఆమె అభివర్ణించారు. బందుకు ఆళ్లగడ్డ తాలూకాలో ప్రజలు స్వచ్ఛందంగా సహకరించారన్నారు. బంద్ నిర్వీర్యం చేయాలన్న వైసిపి కుట్రలు సాగలేకపోయాయన్నారు.

పెద్ద లాయర్లను పెట్టుకుంటే తప్పు ఒప్పుకాదు : ఎమ్మెల్యే

మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేసి పెద్ద లాయర్లను, ఖరీదైన లాయర్లను పెట్టుకున్న తప్పు చేసినప్పుడు తప్పించుకోలేరని, చట్టానికి ఎవ్వరు అతీతులు కాదని అవినీతికి పాల్పడితే శిక్ష తప్పదని ఎమ్మెల్యే కాటసాని రామి రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎంపీ డీవో కార్యాలయం ఆవరణంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడు తూ స్కిల్ డెవలప్మెంట్ స్కాంలో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడం వల్లనే మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడుకు ఏసీబీ కోర్టు రిమా ండ్ విధించిందని అన్నారు. ఎలాంటి కక్ష సాధిం పు చర్యలు లేవని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమావేశం లో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరుపాల్ రెడ్డి, ప్రచార కార్యదర్శి సిద్ధం రామ్మోహన్ రెడ్డి, నాయకులు బండి బ్రహ్మానంద రెడ్డి సురేష్ ఎర్రగుడి రామసుబ్బారెడ్డి, చెర్లో కొత్తూరు చిన్నపు రెడ్డి, వైసీపీ సోషల్ మీడియా నియోజకవర్గ కన్వీనర్ సాదుల శివశంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు స్పందన కరువు...

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

నంద్యాల కలెక్టరేట్: చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజల సొమ్మును కాపాడాల్సింది పోయి అనేక స్కాములు చేసి ఆ సొమ్మునే కాజేశాడని శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి ఆరోపించారు. నంద్యాల జిల్లా కేంద్రం లోని శ్రీశైలం నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు పై ఎన్ని కేసులు పెట్టిన తక్కువేనని 36 కేసుల్లో స్టే తెచ్చుకొని బయట తిరుగుతున్నాడని ఆరోపించారు. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రజా ధనాన్ని లూటి చేశారని విమర్శించారు. అందుకే చంద్రబాబు విషయంలో ప్రజలు పట్టించు కోవడం లేదన్నారు. ఈ సమావేశంలో శ్రీశైలం నియోజకవర్గం ఇంచార్జి భువనేశ్వర్ రెడ్డి,నాయకులు తిరుపతి రెడ్డి,మహేశ్వర్ రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, ప్రవీణ్, పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదులకు సంతృప్తి స్థాయిలో పరిష్కారం చూపండి

- జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం - స్పందన ఫిర్యాదులపై వెంటనే స్పందించి అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సామూన్ సంబం ధిత ధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమంలో కలెక్టరుతోపాటు జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పుల్లయ్య తదితర జిల్లాధికారు లు ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరి ంచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం - స్పందన కార్య క్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి అర్జీదారులు సంతప్తి చెందేస్థాయిలో నిర్ధేశిత గడువులోగా వేగవంతంగా పరిష్కరిం చాలని అధికారులను సూచించారు. జగనన్నకు చెబుదాం ఈకేవైసీకి సంబంధించి పెండింగ్‌లో వున్న 2764 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, డ్రైనేజీ కాలువల్లో చెత్తా చెదారం తొలగింపు, పారిశుధ్య నివారణ తదితర అంశాల్లో ఈఓ ఆర్డీలకు బాధ్యతలు అప్పగించి బాధ్యులను చేయాలని కలెక్టర్ డిపిఓను ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న 900 మంది పిల్లల గ్రాస్ ఎండోమెంట్ సర్వే మూడు రోజుల్లో కంప్లీట్ చేయాలని విద్యాశాఖ అధికారులు కలెక్టర్ ఆదేశించారు. ప్రజా విజ్ఞప్తులను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ జరిపి పరిష్కరించాలన్నారు. అర్జీదారులు సంతృప్తి చెందే స్థాయిలో పరిష్కరించక పోతే మళ్లీ రీఓపెన్ అయ్యే అవకాశముందన్నారు. జగనన్నకు చెబుదాం ఆడిట్‌లో ప్రజలు అసంతృప్తి చెందిన కేసులు, రీఓపెన్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టికి సారించి పరిశీలించాలని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎపి సేవా సర్వీసులకు 1664 దరఖాస్తులు బియాండ్ ఎస్ఎల్ఏ పెండింగ్‌లో ఉన్నాయని 2 రోజుల్లో పూర్తి చేయాలని ఆర్డీఓలు, తాసీల్దార్లను ఆదేశించారు. రీఓపెన్ కేసులకు సంబంధించిన 43 దరఖాస్తులు వెంటనే క్లియర్ చేయాలన్నారు.

ప్రజలనుండి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ జాయింట్ కలెక్టర్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కొన్ని వినతులు

నంద్యాల మండలం కానాలా గ్రామ వాస్తవ్యురాలు మేకల లక్ష్మమ్మ తన కుమారుడు శ్రీహర్ష తేజకు అమ్మ ఒడి పథకంకు సంబంధించిన డబ్బులు పడడం లేదని సచివాలయానికి వెళ్తే అక్కడి సిబ్బంది రెస్పాన్స్ కావడం లేదని మా సమస్యను పరిష్కరించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు. రుద్రవరం మండలం పెద్ద కంబలూరు గ్రామ కాపురస్తుడు మంగలి శేషుడు తనకు యల్లావత్తు గ్రామంలో సర్వే నంబర్ 658లో 11.50 ఏకరాల భూమికి హద్దులు, ఆన్లైన్‌లో మా పేర్లు ఎలాంటివి లేవని సదరు భూమికి ఆన్లైన్, హద్దులు కొలిచి ఇవ్వగలరని జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించుకున్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో 138 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్‌కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ వితిన్ ఎస్ఎల్ఏలోగా పరిష్కరించాలని సంబంధిత అధికా రులకు ఎండార్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. జిల్లా రెవెన్యూ అధికారి పుల్లయ్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సుబ్బారెడ్డి, ఇతర జిల్లాధికారులు పాల్గొన్నారు.

చంద్రబాబు కోసం పొర్లుదండాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

మాజీ సిఎం చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగుండాలని, త్వరగా బెయిల్ రావాలని శ్రీశైలంలో టిడిపి వీరాభిమాని సోమవారం పొర్లుదండాలు పెట్టారు. శ్రీశైల మహా క్షేత్రంలో తెలుగుదేశం పార్టీ ఇంఛార్జి బుడ్డా రాజశేఖర్ రెడ్డి వీర అభిమాని దేశ. ఆంజనేయులు పొర్లుదండాలు పెట్టాడు. చంద్రబాబు నాయుడు ఆరోగ్యం బాగుండాలని, త్వరగా బెయిల్ రావాలని శ్రీశైలం నంది సర్కిల్ నుండి గంగాధర మండపం వద్దకు పొర్లుదండాలు పెట్టుకుంటూ.. వచ్చి స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల

సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

గ్రామాలలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే గంగుల నాని అన్నా రు. సోమవారం ఆళ్లగడ్డ మున్సిపాలిటీ 3వ సచివాలయం పరిధిలోని నాగిరెడ్డి పల్లె గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆళ్లగడ్డ శాసన సభ్యులు గంగుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రజలకు అందిన సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం గ్రామంలోని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే వెంట కేంద్ర కాటన్ బోర్డు మాజీ సభ్యులు శ్రీనివాసరెడ్డి, బద్రి సుధాకర్ రెడ్డి, బద్రి భాస్కర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

శ్రీశైలంలో భక్తుల రద్దీ

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రావణమాసం పురస్కరించుకొని శ్రీశైల క్షేత్ర ంలో సోమవారం నాడు భక్తులతో సందడి పెరిగి ంది. ఈ సందర్భంగా క్షేత్రంలోని స్వామి అమ్మ వార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుం టున్నారు. ఈ మాసంలో తెలుగు రాష్ట్రాల నుండే గాక కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాల నుండి భక్తులు అధిక సంఖ్యలో శ్రీశైలం చేరుకొన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. స్పర్శ దర్శనం క్యూలైన్లోని భక్తులను, స్పర్శ దర్శనం టికెట్ కలిగిన క్యూ లైన్ భక్తులను విడతలవారీగా దర్శనానికి పంపిస్తున్నారు. భక్తులకు అవసరమైన లడ్డు ప్రసాదాలు అందించేందుకు ఏడు కౌంటర్లు ఏర్పాటు చేయడం జరిగిందని దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న తెలిపారు. క్షేత్ర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రత్యేక పోలీసు బందోబ స్తును ఏర్పాటు చేశారు. క్షేత్రంలోని దుకాణాలన్నీ వ్యాపారస్తులతో భక్తులతో కిటకిటలాడుతున్నాయి.

సిసి రోడ్ల పరిశీలన

ప్రజాశక్తి - రుద్రవరం

మండల కేంద్రం రుద్రవరంలోని బెస్త కాలనీలో నిర్మించిన సిసి రోడ్ల నిర్మాణ పనుల నాణ్యతను విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ అధికారులు సోమవారం పరిశీలించారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆళ్లగడ్డ ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి రుద్రవరంలోని రెండవ సచివాలయం పరిధిలో పర్యటించినప్పుడు కాలనీ వాసులు సిసి రోడ్డు నిర్మించాలని కోరడంతో ఆయన స్పందించి గడపగడపకు మన ప్రభుత్వం నిధుల్లో భాగంగా రూ. 20 లక్షల నిధులు మంజూరు చేశారు. ఇందులో భాగంగా రూ 10 లక్షలతో నిర్మించిన రోడ్డును విజిలెన్స్ అండ్ క్వాలిటీ కంట్రోల్ డి

సిసి రోడ్ల నిర్మాణ నాణ్యతను పరిశీలించిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు

ఈమోహన్ రావు జేఈ ఐయాజ్, పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి రోడ్ల నిర్మాణ నాణ్యత నివేదికను ఉన్నతాధికారులకు పంపడం జరుగుతుందన్నారు. వీరి వెంట పిఆర్ ఏఈ వెంకటరాముడు, ఇంజనీర్ అసిస్టెంట్లు శుభ దివ్యవాణి, వేద నర్సింహులు ఉన్నారు.

ఆలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - బనగానపల్లె

మండలంలోని నందవరం గ్రామంలో బాల బ్రహ్మేశ్వరుడు, వీర భద్రుడు ఆలయాల పునర్ని ర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూమి పూజ నిర్వహించారు. సోమవారం మండలంలోని నందవరం గ్రామంలో 40 లక్షల రూపాయలతో బాల బ్రహ్మేశ్వరుడు,వీర భద్రుడు ఆలయాల పునర్నిర్మాణానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి భూమి పూజ నిర్వహించి, చౌడేశ్వరి దేవి అమ్మ వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డికి ఆలయ ఈవో రామానుజన్, సిబ్బంది ,పూజారులు ఆలయ పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి మాట్లాడారు. పురాతన ఆలయాలకు దేవదాయ శాఖ, టిటిడి దేవస్థానం వారి సహాయ సహకారాలతో ఆలయ పునర్ని ర్మానాలు చేపట్టడం జరుగుతుందని, సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి అవుకు మండల కన్వీనర్ కాటసాని తిరు పాల్ రెడ్డి,పార్టీ ప్రచార కార్యదర్శి సిద్దం రెడ్డి రామ్మోహన్ రెడ్డి, చౌడేశ్వరి దేవి దేవస్థానం మాజీ చైర్మన్ పి.ఆర్ వెంకటేశ్వర రెడ్డి, కేడీసీసీ బ్యాంకు జిల్లా డైరెక్టర్ పి. ఆర్ .మురళీమోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల బ్రహ్మేశ్వరుడు, వీర భద్రుడు ఆలయాల పునర్నిర్మా ణానికి భూమి పూజ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

శ్రీ జంబులమ్మ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు మండలం జూటూరు గ్రామం లో శ్రీ జంబులమ్మ నూతన ఆలయ నిర్మాణానికి సోమవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. ఈ భూమి పూజకు జూటూరు సర్పంచ్ నాయిని సావిత్రమ్మ, ఎంపీడీవో గోపికృష్ణ, తాసిల్దార్ రత్న రాధిక స్థల దాతలు, కమిటీ సభ్యులు భూమి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నాయిని సావిత్రమ్మ మాట్లాడుతూ జూటూరు గ్రామ జంబులమ్మ గుడి నేషనల్ హైవేలో పోతుండడంతో స్థల దాతలు సక్కుబాయి, రామకృష్ణ సింగ్ వారి కుటుంబ సభ్యుల సహకారంతో నూతన ఆలయాన్ని గ్రామము కమిటీ ఆధ్వర్యంలో నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం తాసిల్దార్ రత్న రాధిక, ఎంపీడీవో గోపికృష్ణ మాట్లాడుతూ గ్రామంలో కులమత బేధాలు లేకుండా ఐక్యమత్యంతో నిర్మాణం చేపట్టడం సంతోషించదగ్గ విషయం అన్నారు.

భూమి పూజ చేస్తున్న దృశ్యం

ఘనంగా అటవీ శాఖ అమరవీరుల దినోత్సవం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలో సోమవారం నాడు జాతీయ అటవీ శాఖ అమరవీరుల దినోత్సవము ఘనంగా నిర్వహి ంచారు. నల్లమల అడవిలోని భైర్లుటీ గూడెంలో డిప్యూటీ డైరెక్టర్, ప్రాజెక్ట్ టైగర్ అధికా రుల ఆధ్వర్యంలో అటవీ శాఖ అమరవీరులకు అశ్రు నివాళులు అర్పించారు. అనంతరం మాన వతా వృద్ధుల ఆశ్రమంలో, గవర్నమెంట్ హాస్పిటల్ నందు పండ్లు పంపిణీ చేశారు.

రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తున్న అటవీశాఖ అధికారులు

సమస్యల పరిష్కారానికే సచివాలయాలు

-ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండలంలో గ్రామాలలోని ప్రజల సమస్యల పరిష్కారానికి గ్రామస్థాయిలో సచివాలయాల ఏర్పాటు చేయడం జరుగుతోందని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. సోమవారం నాడు మండల పరిధిలోని ఎంబాయి గ్రామంలో 35 లక్షల రూపాయలతో గ్రామ సచివాలయం, 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.17.50 లక్షల రూపాయలతో వైయస్సార్ హెల్త్ క్లినిక్ కార్యాల యాలు నిర్మాణాలు పూర్తయిన సందర్భంగా ఎంపీపీ నాగభూషణం రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి బుగ్గన చొరవతో అన్ని గ్రామాలలో సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేయడం జరుగుతుందని ఆయన అన్నారు. ఎం బాయి గ్రామ సర్పంచ్ యుగంధర్ రెడ్డి, కోడే వెంకటేశ్వర్లు, రామానాయుడు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న ఎస్ఐ రమణయ్య

బొప్పాయి మొక్కలు నరికివేత

ప్రజాశక్తి - చాగలమర్రి

మండలంలోని చిన్నవంగలి గ్రామంలో బొప్పా యి మొక్కలను నరికివేసిన సంఘటన సోమవారం చోటు చేసుకు ంది. చిన్నవంగలి గ్రామానికి చెందిన రైతు వెంకట ప్రసాద్‌రెడ్డి తనకు 2.50 ఎకరాలలో పసుపు పంటలో అంతర్గత పంటగా బొప్పాయిని సాగు చేస్తున్నాడు. గత రెండు నెలలుగా సాగు చేస్తున్న సుమారు 1200 బొప్పాయి మొక్కలను గుర్తు తెలియని వ్యక్తులు నరికివేసినట్లు బాధిత రైతు వాపోయారు. దాదాపు 2 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లిందని బాధిత రైతు ఆవేద న వ్యక్తం చేసారు. ఈ విషయాన్ని పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేయగా ఎస్ఐ రమణయ్య సంఘటనా స్థలానికి చేరుకొని నరికి వేసిన బొప్పాయి మొక్కలను పరిశీ లించి విచారణ చేపట్టారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితు రైతు కోరారు.

మోడల్ స్కూల్ విద్యార్థులకు రాష్ట్రస్థాయి బంగారు పథకాలు

ప్రజాశక్తి - రుద్రవరం

రుద్రవరం ఆదర్శ పాఠశాల విద్యార్థిని, విద్యార్థులు ఈనెల 9,10 తేదీలలో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగిన రాష్ట్రస్థాయి జంపురోప్ పోటీలలో నాలుగు గోల్డ్ మెడల్స్ రెండు సిల్వర్ మెడల్స్ సాధించి నట్లు ప్రిన్సిపల్ సం గెపు నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ వారిలో మానస, స్పందన, అలేఖ్య, లక్ష్మీ వర్షలు గోల్డ్ మెడల్స్, హైమావతి, రాజేశ్వరిలు సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. రాష్ట్రస్థాయిలో గోల్డ్ మెడల్స్, సిల్వర్ మెడల్స్ సాధించడం హర్షణీయం అని, మెడల్స్ సాధించడంలో ఫిజికల్ డైరెక్టర్ పి, శ్రీనివాసులు కృషి అభినందనీయమని ప్రిన్సిపాల్ తెలియజేశారు. మెడల్స్ సాధించిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్‌ను పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ సంగెపు నాగేశ్వర రావు

బంద్ ప్రశాంతం..

5వ పేజీ తరువాయి..

టిడిపి నాయకులు పట్టణ ఉపసర్పంచ్ పురానుద్దీన్, టిడిపి మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు రాయలసీమ సలాం, సిపిఎం మండల కార్యదర్శి జెవి సుబ్బయ్య, సిపిఐ మండల కార్యదర్శి సుబ్బారెడ్డి, నాయకులు బాలకృష్ణ, సంజీవులు, జనసేన పార్టీ నాయకులు భాస్కర్, బిజెపి నాయ కులు బచ్చు శరత్ చంద్ర కుమార్‌లను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. సాయంత్రం సొంత పూచికత్తుపై విడుదల చేశారు.

– పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో టిడిపి నాయకులు ధర్నా నిర్వహిస్తుండడంతో ఎస్సై రామిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ధర్నాను అడ్డుకోవడంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ కార్యక్రమంలో టిడిపి వాణిజ్య విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరి శీనయ్య, తెలుగు యువత జిల్లా అధ్యక్షులు బొబ్బల గోపాల్ రెడ్డి, టిడిపి ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షులు కృష్ణా నాయక్, టిడిపి పట్టణ అధ్యక్షులు ఖాసిం బాబు, మండల కార్యదర్శి ఖాదర్ బాషా, నాయకులు టిప్ టాప్ కలాం, తెలుగు యువత నాయకులు పవన్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. **నందికొట్కూరు:** నందికొట్కూరులో టిడిపి శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలపగా పట్టణ పోలీస్ స్టేషన్ సిఐ విజయ్ భాస్కర్ ఆధ్వర్యంలో టిడిపి నాయకులు జయ సూర్య, ఖాతా రమేష్ రెడ్డి, షకీల్ అహ్మద్, లాయర్ జాకీర్ హుస్సేన్, ముర్తు జావలి, సురే ంద్ర,పాణ్యం వేణు, నిమ్మకాయల రాజు, కళాకర్, బో ల్లెద్దుల రాజన్న, తదితరులను పోలీ సులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు. పట్టణ ఎస్ఐ ఎన్వి రమణ, బ్రాహ్మణ కొట్టుకూరు ఎస్ఐ ఓబులేష్ తమ సిబ్బందితో వాహన రాకపోకలకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పర్యవేక్షించారు. పోలీసుల కంటపడకుండా నియోజవర్గ టిడిపి నాయకులు అధికార ప్రతినిధి కాకరవాడ చిన్న వెంకటస్వామి అంబేద్కర్ విగ్రహం వద్దకు చేరుకొని మహనీ యునికి పూలమాలవేసి అంబేద్కర్ రాజ్యాంగం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. చంద్రబాబు నాయుడు వెంటనే రిలీజ్ చేయాలని అంబేద్కర్ సెంటర్ సర్కిల్ రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఎస్సై ఓబులేష్ తన సిబ్బందితో హుటాహుటిన అక్కడికి చేరుకొని టీడీపీ నాయకులు కాకరవాడ చిన్న వెంకటస్వామి, సంప త్‌లను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తర లించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులకు, పోలీసులకు కొంత వాగ్వాదం చోటుచే సుకుంది. **వెలుగోడు:** టిడిపి మండల అధ్యక్షుడు అన్నారపు శేషిరెడ్డి, ఖలీల్ ఖాన్, అమీర్ అంజా, ఇదాయతలి ఖాన్, మోమిన్ రసూల్, నాగ శేఖర్, భూపాల్ చౌదరి, రామానాయుడు, హుస్సేన్ సాహెబ్, సూర్యనారాయణ రెడ్డి, కృష్ణారెడ్డి, ఏజాస్, రఘు స్వామి రెడ్డి, తదితరులను వెలుగోడు ఎస్ఐ వెంకటప్రసాద్ అరెస్ట్ చేశారు. **మహానంది:** తెలుగు దేశం పార్టీ మండల అధ్యక్షుడు ఉల్లి మధు ఆధ్వర్యంలో టిడిపి నాయకులు, కార్య కర్తలు మహానందిలోని తెలుగుగంగ ప్రధాన కాలు వ ఎన్టీఆర్ విగ్రహం వద్ద నిరసన తెలపగా పోలీసు లు నేతలను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో మహానంది మండల టిడిపి నాయకులు కాకర్ల శివ, ఆస్లామ్ బాష, శ్రీను కార్యకర్తలు ఉన్నారు. **సున్నిపెంటలో.. శ్రీశైలం ప్రాజెక్టు :** శ్రీశైలం మండలం సున్నిపెంట అంబేద్కర్ సెంటర్ నందు స్థానిక టిడిపి మండల నాయకుల ఆధ్వర్యంలో చంద్ర బాబు నాయుడు రిమాండ్‌ను వ్యతిరేకిస్తుండగా స్థానిక సిఐ దివాకర్ రెడ్డి వెంటనే వారిని రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో అడుసుమల్లి సుబ్బారావు,శ్రీశైలం రమణ, పీరా,చిన్నబాబు, రూపస్,శ్రీనుతోపాటు దాదాపు 30 మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. **బేతంచర్ల :** టిడిపి మండల కన్వీనర్ ఉన్నం ఎల్ల నాగయ్య, బేతంచెర్ల పట్టణ కార్యదర్శి షేక్షావల్లి చౌదరిలను పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామాల నుంచి మండల కేంద్రానికి తరలి వచ్చిన నాయకులు కార్యకర్తలు ర్యాలీ నిర్వహిస్తూ పాత బస్టాండ్ వరకు రాగా బేతంచెర్ల ఎస్సై శివశంకర్ నాయక్ పోలీస్ సిబ్బందితో వారిని నిలవరించి అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. **కోవెలకుంట్ల :** కోవెలకుంట్ల బందుకు పిలుపునిచ్చిన గడ్డం రామకృష్ణారెడ్డిని, పట్టణ తెలుగుదేశం కార్య కర్తలను, నాయకులను మాజీ మార్కెట్ మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం నాగేశ్వరరెడ్డి, ఆమడాల మద్దిలేటి, పెనుగొండ రాజశేఖర్, మురళి, కుళ్ళాయి, జనసేన గుర్రప్ప తదితరులను సోమవారం తెల్లవారుజామున పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. **బండి ఆత్మకూర్:** జనసేన పార్టీ, ఎమ్మార్పీఎస్ మద్దతుతో తెలుగుదేశం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల సురేష్ రెడ్డి ఆధ్వర్యంలో బండి ఆత్మకూరు మండల కేంద్రంలో బంద్‌ను చేపటగా ఎస్ఐ మల్లికార్జున సిబ్బందితో కలిసి వారిని అరెస్టు చేశారు.

నందికొట్కూరు : రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపిన టిడిపి నేతలు

శ్రీశైలం ప్రాజెక్టు: అరెస్టు అయిన టిడిపి నాయకులు

మాజీ మంత్రి అఖిలప్రియ ఇంటి ముందర పోలీస్ బందోబస్తు

బనగానపల్లె : వివిధ పార్టీల నాయకులను అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచిన దృశ్యం

మహానందిలో అరెస్టు అయిన టిడిపి నాయకులు

పగిడ్యాల : బంద్ నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

బీసీ ఇందిరాను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

బేతంచెర్లలో నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

కోవెలకుంటల్ల : అరెస్టు అయిన టిడిపి నాయకులు

ఆత్మకూరు : కర్నూల్ గుంటూరు రహదారిపై ఆందోళన నిర్వహిస్తున్న టిడిపి కార్యకర్తలు

నేడు అవుకుకు ఎమ్మెల్యే రాక

ప్రజాశక్తి - అవుకు

అవుకు పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ట్యాంకు ప్రారంభించుటకు బనగానపల్లె శాసనసభ్యులు కాటసాని రామిరెడ్డి మంగళవారం వస్తున్నట్లు కాంట్రాక్టర్ మద్దయ్య సోమవారం తెలిపారు. వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలకు మంచినీటి సౌకర్యం కల్పించేందుకు ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు కాంట్రాక్టర్ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - వెలుగోడు

ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రామలింగారెడ్డిని జడ్‌పిహెచ్ వేల్పనూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెలుగోడు జీవశాస్త్ర సహాయకుడు సుబ్రహ్మణ్యం, యుటిఎఫ్ వెలు గోడు మండల శాఖ సోమవారం వెలుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా సన్మాని ంచారు. ముఖ్యఅతిథిగా వెలుగోడు మండల ఎంఈఓ బ్రహ్మం నాయక్ పాల్గొని వారి సేవలను కొనియాడారు. మారుతున్న పరిస్థితులు సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా విద్యార్థులకు పాఠ్యాం శాలు బోధించాలన్నారు. యు టి ఎఫ్ రాష్ట్ర కౌన్సి లర్ నాగ స్వామి నాయక్, మండల గౌరవ అధ్య క్షుడు రామకృష్ణ, మండల అధ్యక్షుడు జాకీర్ హుస్సే న్, ఫకీర్హమద్, శేషయ్య, రామకృష్ణ, పార్థసారథి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సన్మానం చేస్తున్న దృశ్యం

మహారాజశ్రీ ఆళ్లగడ్డ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E. P. No.7/2020 In O S. No.53/2018

ఈదుల నాగలక్ష్మమ్మ,
W/o.రామస్వామి, వయస్సు 53 సం॥లు,
H.No.8-5-107/1, కడప రోడ్డు,
ఆళ్లగడ్డ గ్రామం మరియు మండలం
నంద్యాల జిల్లా.
...D Hr

V/S

మందుల ఏడుకొండలు,
S/o.చిన్న వెంకటప్ప, విశ్రాంత ఉద్యోగి,
వయస్సు 60 సం॥లు,
H.No.5/161, సిరివెళ్ళ గ్రామం మరియు మండలం
నంద్యాల జిల్లా ...J Dr

J Dr కు ఆర్డర్ 21 రూల్ 54 నోటీసులు

DHr, J Dr అయిన నీపై డిక్రీ బాకీ వసులు కోరి E.P దాఖలు చేసి ఉన్నందున సదరు E.P లో నీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా 25-09-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు పై కోర్టులో నీవు స్వయంగా కాని, మీ వకీలు ద్వారా కానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను. లేని యెడల నీకు పరోక్షంగా E.P తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా :25-09-2023

ఇట్లు
బి.నీలకంఠేశ్వరం,
DHr తరపున అడ్వకేట్,
ఆళ్లగడ్డ.